
www.vishalabharati.com
epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
09.08.2024
సంపుటి:2 సంచిక:295

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



# హైదరాబాద్ లో చార్లెస్ స్క్వాబ్ సెంటర్

- కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ చర్చలు
- చర్చలు ఫలప్రదమయ్యాయని ప్రకటించిన అధికారులు
- హైదరాబాద్ లో అన్ని వసతులు కల్పిస్తామంటూ రేవంత్ భరోసా

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా పలు ప్రముఖ కంపెనీలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమవుతూ బిజీగా గడుపుతున్నారు. ఈ పర్యటనలో భాగంగానే ఆర్థిక కార్యకలాపాల్లో అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన డల్లాస్ లోని చార్లెస్ స్క్వాబ్ కేంద్ర కార్యాలయాన్ని సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సందర్శించారు. హైదరాబాదులో ఈ సంస్థ టెక్నాలజీ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిందని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. ఈ చర్చల్లో చార్లెస్ స్క్వాబ్ సంస్థ ఎగ్జిక్యూటివ్స్ డెన్నిస్ హొవార్డ్, రామ బొక్క పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో సంస్థ ప్రతినిధులు జరిపిన చర్చలు ఫలవంతమైనట్లు ప్రభుత్వ ప్రతినిధులు తెలిపారు. భారత్ లో ఈ సంస్థ తొలి టెక్నాలజీ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి చర్చలు జరిపారు. సిఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనల పట్ల సంస్థ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఈ సంస్థ కార్యకలాపాలను హైదరాబాదులో నెలకొల్పేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు వసతులు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.ప్రభుత్వం నుంచి వచ్చిన సానుకూల స్పందనల పట్ల స్క్వాబ్ సంస్థ ప్రతినిధులు

..మిగతా 2 లో



# విపక్షాల లొల్లి మధ్యే లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లు

- సభలో ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విపక్ష సభ్యులు
- ముస్లింల హక్కుల ను కాలరాస్తున్నారంటూ విమర్శలు
- చివరకు జాయింట్ పార్లమెంట్ కమిటీకి బిల్లు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వక్ఫ్ బిల్లుని 2024 లోక్సభలో ప్రవేశపెట్టారు. ఇకపై వక్ఫ్ బోర్డుల అధీనంలో ఉండే ఆస్తులన్నింటిపైనా కేంద్ర ప్రభుత్వానికే అధికారం ఉండేలా ఈ బిల్లులో మార్పులు చేశారు. అయితే...ఈ బిల్లుపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమని నినదించారు. కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ తీవ్ర విమర్శలు చేశారు. ఇది రాజ్యాంగంపైన దాడి చేయడమే అని తేల్చి చెప్పారు. ముస్లిమేతరులను కూడా వక్ఫ్ కౌన్సిల్‌లో సభ్యులుగా చేర్చడాన్నీ తప్పుబట్టారు. ఇది మత స్వేచ్ఛకు విరుద్ధమని మండి పడ్డారు. ముస్లింల తరవాత క్రిస్టియన్లు, జైనులు..ఇలా వరస పెట్టి మిగతా మతాల వాళ్ల హక్కుల్ని అణిచివేస్తారా అని ప్రశ్నించారు. ఇలాంటి రాజకీయాల్ని

..మిగతా 2 లో



# పార్లమెంటులో ఫొగట్ వివాదంపై రచ్చ

- ఫొగట్ అనర్హతపై రాజ్యసభలో చర్చించాలని ప్రతిపక్ష నేతల పట్టు
- అనుమతి లభించకపోవడంతో వాకౌట్ చేసిన ప్రతిపక్షాలు
- రాజ్యసభ చైర్మన్ తీవ్ర అసంతృప్తి
- ప్రతి అంశాన్ని రాజకీయం చేయొద్దంటూ మండిపాటు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పటడం యావత్ భారతావనిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆమెకు న్యాయం జరిగేలా చూడాలంటూ విపక్ష నేతలు కేంద్రాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే వినేశ్ అనర్హతకు దారితీసిన పరిస్థితులపై చర్చకు రాజ్యసభలో విపక్షాలు పట్టుబట్టాయి. ఇందుకు ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ నిరాకరించడంతో ప్రతిపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ పరిణామాలతో విపక్ష నేతల తీరుపై ఛైర్మన్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. "వినేశ్‌పై అనర్హత పడినందుకు వారి (ప్రతిపక్షాలు) హృదయం మాత్రమే ద్రవిస్తున్నట్లు వారు మాట్లాడుతున్నారు. ఆ అమ్మాయి పరిస్థితి చూసి దేశం మొత్తం బాధపడుతోంది. కానీ, దీన్ని రాజకీయం చేస్తే అది ఆమెను అవమానపర్చినట్లే. ఆమె ప్రయాణం సుదీర్ఘంగా ఉంది" అని ధన్‌ఖడ్ అన్నారు. అంతకుముందు సభలో కేంద్రమంత్రి జేపీ నడ్డా దీనిపై మాట్లాడారు. "వినేశ్‌కు యావత్ దేశం అండగా ఉంది. ఆమె ఛాంపియన్లకే ఛాంపియన్ అని మోదీ నిన్న అన్నారు. 140 కోట్ల మంది భావన కూడా అదే. దురదృష్టవశాత్తూ ఈ అంశాన్ని సభలో మనం విపక్షం, అధికార పక్షం అన్నట్లు విభజిస్తున్నాం. ఆమె విషయంలో కేంద్రం, క్రీడాశాఖ, భారత ఒలింపిక్ మండలి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి" అని నడ్డా వివరించారు.



## కేంద్రం మౌనం ఎందుకు?: కాంగ్రెస్

మరోవైపు ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సుర్జేవాలా మాట్లాడుతూ.. "ఈ కష్ట సమయం నుంచి ఆమె కోలుకుని మళ్లీ బలంగా తిరిగొస్తుందని దేశమంతా విశ్వసిస్తోంది. కానీ కేంద్రం ఎందుకు దీనిపై మౌనంగా ఉంటోంది? చేజారిన ఆ పతకం వినేశ్ ఒక్కదానిదే కాదు.. మన దేశానిది. దీనిపై భారత ఒలింపిక్ సంఘం.. అంతర్జాతీయ ఒలింపిక్ సంఘంతో మాట్లాడాలి. ఆమెకు రజతం వచ్చేలా చూసే బాధ్యత కేంద్రానిదే" అని అన్నారు.

## మెరుగైన సేవలందించేందుకే జీఐఎస్ సర్వే

డ్రోన్, ఇంటింటి సర్వే ద్వారా ఆస్తి పన్ను పెంపు ఉండదు

- 6 నెలల్లో జీఐఎస్ సర్వే పూర్తి
- డ్రోన్ సర్వేపై ప్రజల్లో అనుమానాలపై క్లారిటీ
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



..మిగతా 2 లో



విశాలభారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
శుక్రవారం, 09.08.2024
హైదరాబాద్




# హైదరాబాద్ లో చార్లెస్ స్క్వాబ్ సెంటర్

మొదటిపేజీ తరువాయి

హర్షాన్ని వ్యక్తం చేశారు. సెంటర్ ను హైదరాబాదులో ఏర్పాటుకు సంబంధించి తుది అనుమతులు రావాల్సి ఉందని, ఈ మేరకు చర్యలను వేగవంతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు. కొద్దిరోజుల్లోనే భారత్ కు ప్రతినిధుల బృందాన్ని పంపిస్తామని ఈ సందర్భంగా సీఎంకు హామీ ఇచ్చారు. ఆర్థిక సేవల్లో చార్లెస్ స్క్వాబ్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

## మెరుగైన సేవలందించేందుకే
# జీఐఎస్ సర్వే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆస్తి పన్ను మదింపుతోపాటు నగరవాసులకు మెరుగైన సేవలు అందించేందుకు భాగ్యనగరంలో చేపట్టిన జీఐఎస్ సర్వే వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. జీహెచ్ఎంసీ లోని 5 సర్కిళ్లలో జులై 30న మొదలుపెట్టిన ఇంటింటి సర్వే ద్వారా ఇప్పటి వరకు 130 చదరపు కిలోమీటర్లు మాత్రమే డ్రోన్ సర్వే జరిగిందని వెల్లడించారు.
డ్రోన్ సర్వేపై ప్రజల్లో అనుమానాలు, విమర్శలు వ్యక్తమవుతున్న వేళ రెవెన్యూ విభాగం అదనపు కమిషనర్ స్నేహ శబరీశ్తో కలిసి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమ్రపాలి వివరాలను వెల్లడించారు. శాటిలైట్ మ్యాపింగ్కు అనుగుణంగా డ్రోన్ల ద్వారా కేవలం నగరంలోని నిర్మాణాలు, భవనాలు, రహదారులు, ఆస్తులను గుర్తించేందుకు మాత్రమే సర్వే చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇందుకోసం యజమానుల నుంచి బలవంతంగా ఎలాంటి ఆధారాలు సేకరించడం లేదని పేర్కొన్న ఆమ్రపాలి అనధికారిక, అధికార నిర్మాణాల ప్రస్తావన లేకుండా సర్వే చేస్తున్నట్లు వివరించారు.డ్రోన్, ఇంటింటి సర్వే ద్వారా ఆస్తి పన్ను పెంపు ఉండదని ఆమ్రపాలి స్పష్టం చేశారు. ఆస్తి పన్ను పెంపు ప్రభుత్వం తీసుకునే నిర్ణయమని పేర్కొన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సర్వే నిర్వహించడం వల్ల జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ఆస్తులు, యుటిలిటీస్ మ్యాప్ చేయడానికి ఈ సర్వే దోహదపడుతుందన్నారు.మొత్తం 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో జరిగే ఈ సర్వేలో కంటోన్మెంట్ లాంటి సెక్యూరిటీ జోన్లకు సంబంధించిన సమాచారం బహిర్గతం కాదని, ప్రజల నుంచి సేకరించిన వివరాలు కూడా అత్యంత భద్రంగా ఉంచుతామని ఆమ్రపాలి తెలిపారు. నగరంలో రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలతో కలిపి సుమారు 19 లక్షల 43 వేల నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించామని, అందులో కమర్షియల్ గా 2.7 లక్షల గృహాలు ఉన్నట్లు తెలిపారు. సామాన్యుల నివాసాల నుంచి కాకుండా వ్యాపార, వాణిజ్య కేంద్రాల నుంచి వాస్తవ ఆస్తి పన్ను రాబడతామని తెలిపారు.జీఐఎస్



సర్వే ద్వారా ప్రజలకు ప్రభుత్వ పరంగానే కాకుండా ప్రైవేటుగానూ ఎన్నో రకాల సేవలందుతాయని ఆమ్రపాలి వివరించారు. డ్రోన్ సర్వే పూర్తయ్యాక ప్రతి అంశం మ్యాపింగ్ జరుగుతుందని, తద్వారా వీధుల్లో విద్యుత్ దీపాల దగ్గరి నుంచి చెత్త సేకరణ వరకు ప్రతి అంశం జీహెచ్ఎంసీకి సమగ్ర వివరాలు అందుతాయన్నారు. ఆస్తి పన్ను మదింపులోనూ చాలా సులభతరం అవుతుందన్నారు.ఈ మేరకు రోజూవారీ జీవితంలో తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్న ఆమ్రపాలి తాను నివాసం ఉండే కుందన్ బాగ్ లో చెత్త సేకరణ సరిగా చేయడం లేదని, ఆ విషయం ఈ సర్వే అనంతరం ఎప్పటికప్పుడు తెలిసిపోతుందన్నారు. అలాగే ఇంటింటికి ప్రత్యేకంగా డిజిటల్ డోర్ నెంబర్ ఇస్తామని, దానిపై ఉన్న క్యూఆర్ కోడ్ వల్ల ఆ ఇంటికి లేదా వీధిలో ఎలాంటి సేవలందాయనే విషయాలు క్షణాల్లో తెలిసిపోతాయన్నారు. ప్రజల నుంచి సేకరించే డేటా రేల్ టేల్ సర్వర్లో అత్యంత భద్రంతా ఉంటుందన్నారు. మొదట్లో ఒక్కో ఇంటి వద్ద సర్వే కోసం 40 నుంచి 45 నిమిషాల సమయం పడుతుందని, అందుకోసం సేకరించే వివరాలను తగ్గించామని ఆమ్రపాలి తెలిపారు. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా డ్రోన్ సర్వే నెమ్మదిగా సాగుతుందని రెవెన్యూ విభాగం అదనపు కమిషనర్ స్నేహ శభరీష్ తెలిపారు. నగరంలో ప్రస్తుతం 90 బృందాలు సర్వే నిర్వహిస్తున్నాయని, అవసరాన్ని బట్టి సర్వే బృందాల సంఖ్యను పెంచుతామన్నారు. మొత్తం 600 బృందాలతో రానున్న 6 నెలల్లో జీఐఎస్ సర్వేను పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు.

# విద్యుత్ సమస్యలు రానివ్వొద్దు

- హైదరాబాద్ వచ్చేందుకు కంపెనీలు రెడీ
- వర్షా కాలం దృష్ట్యా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి
- విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 హెల్ప్ లైన్ నంబర్
- డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



హైదరాబాద్ మహా నగరంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 హెల్ప్ లైన్ నంబర్తో పాటు పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. సమావేశం ముగిసిన అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఫార్మా, బయోటెక్, ఇతర సర్వీస్ రంగాల్లో హైదరాబాద్లో పెట్టుబడులు పెట్టడానికి మల్టీ నేషనల్ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ నగరంలో వినియోగదారులందరికీ నాణ్యతతో కూడిన విద్యుత్ను సరఫరా చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు ఎక్కడా అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల సేవల కోసం ఏర్పాటు చేసిన 1912 హెల్ప్ లైన్కు విస్తృత ప్రచారం కల్పించనున్నట్లు తెలిపారు. 108 తరహాలో విద్యుత్ సంస్థ హెల్ప్ లైన్ సేవలను విస్తృతం చేస్తామన్నారు. గాలి పీల్చుకోవడం ఒక నిమిషం ఆగిపోతే ఎంత ప్రమాదమో విద్యుత్తు స్తంభిస్తే అంతే ప్రమాదంగా ప్రజలు భావిస్తున్నారని.. మారిన కాలానికి అనుగుణంగా విద్యుత్ సిబ్బంది సేవలు పెరగాలని డిప్యూటీ సీఎం సూచించారు.విద్యుత్ శాఖ సేవా దృక్పథంతో పనిచేస్తుంది.. సమాజానికి వెలుగులు ఇచ్చే శాఖలో పని చేస్తున్నామనే భావన ఉద్యోగుల్లో ఉండాలి. ఆ భావన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మాకు బేషజాలు లేవు.. ఎంత చిన్నవారు సమస్యలు చెప్పిన వినడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పదోన్నతులు బదిలీలకు సంబంధించిన కార్యాచరణ వెంటనే చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించామని భట్టి విక్రమార్క తెలిపారు.



# విద్యార్థులకు నష్టంచేసే జీవో-33పై పోరాటం

- హరీశ్రావును కలిసిన జీవో33 బాధితుల తల్లిదండ్రులు
- విద్యార్థులు ఆందోళన చెందొద్దు
- బీఆర్ఎస్ అండగా ఉంటుంది

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగజే జీవో 33పై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్రావు అన్నారు. జీవో 33 బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు హైదరాబాద్లో ఆయన్ను కలిశారు. ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోపై తమ గోడును ఆయనతో వెల్లబోసుకున్నారు. ప్రభుత్వ అనాలోచితంగా తీసుకొచ్చిన ఈ జీవో కారణంగా తమ పిల్లలు వైద్యవిద్య చదివే అవకాశాలు కోల్పోతున్నట్లు హైదరాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల నిబంధన వల్ల రాష్ట్రంలో పుట్టిన పిల్లలు తెలంగాణలో నాన్లోకల్ కావడం అత్యంత బాధగా ఉందని తల్లిదండ్రులు వాపోయారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల స్వరాష్ట్రంలో తెలంగాణ బిడ్డలు ఎంబీబీఎస్, బీడీఎస్ చదివే అవకాశం కోల్పోతున్నారని తెలిపారు. తమ పిల్లలకు న్యాయం జరిగేలా చూడాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని హరీశ్రావును కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా న్యాయ పోరాటానికి సైతం వెనకాడబోమని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వ ఉత్తర్వులు 33 సంబంధించి తల్లిదండ్రులు, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఈ విషయంలో బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పిల్లలకు అడ్మిషన్ల కోసం స్థానికత నిర్ధారించుకోడానికి కొత్త సమగ్ర విధానం రూపొందించాలని సూచించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో ఒక ఉన్నత స్థాయి కమిటీ వేసి తెలంగాణ విద్యార్థులకు అడ్మిషన్స్ విషయంలో ఏ విధమైన అన్యాయం జరగకుండా చూడాలని హరీశ్రావు విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఇదే విషయంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. తెలంగాణ విద్యార్థులకు మెడిసిన్ సీట్ల విషయంలో అన్యాయం చేస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానికత విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అనుమానాస్పదంగా కనిపిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 ప్రకారం నిర్ధేశించిన స్థానికతలోని అంశాలు, వేలితో విద్యార్థుల కళ్లను పొడిచినట్లే ఉన్నాయని ఎక్స్ వేదికగా బుధవారం రోజున మండిపడ్డారు.

## విపక్షాల లొల్లి మధ్యే
# లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లు

మొదటిపేజీ తరువాయి

దేశ ప్రజలు సహించరని తేల్చిచెప్పారు. "మేమంతా హిందువులమే. కానీ మిగతా మతాల పట్ల మాకు విశ్వాసం ఉంది. కేంద్రం తీసుకొచ్చిన ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం. కేవలం మహారాష్ట్ర, హరియాణాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ బిల్లు తీసుకొచ్చారు. ఇప్పటికే భారత దేశ ప్రజలు లోక్సభ ఎన్నికల ఫలితాల్లో మీకు తగిన పాఠం చెప్పారు. ఫెడరల్ వ్యవస్థపైనే మీరు దాడి చేస్తున్నారన్న సంగతి గుర్తుంచుకోండి" అంటూ కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ విమర్శించారు. చివరకు ఈ బిల్లును జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీకి

**అసదుద్దీన్ అసహనం..**



ఈ బిల్లుపై AIMIM ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15 లను ఈ బిల్లు ఉల్లంఘిస్తోందని మండి పడ్డారు. ఇలాంటి చట్టాలతో దేశాన్ని విడగొడుతున్నారని ఆరోపించారు. ముస్లింలను బీజేపీ శత్రువులుగా చూస్తోందనడానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. ఈ చట్టం అమల్లోకి వచ్చాక వక్ఫ్ బోర్డ్ పరిధిలోని ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించడం తప్పనిసరి అవుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా కేంద్రం ఓ ఆన్లైన్ పోర్టల్ తీసుకొస్తుంది. మరో ప్రతిపాదన ఏంటంటే...సెంటర్ వక్ఫ్ కౌన్సిల్తో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డులు ఏర్పాటు చేయాలి. అందులో ముస్లిం మహిళలతో పాటు ముస్లిమేతరులూ సభ్యులుగా ఉంటారు. ఈ చట్టం అమలు బాధ్యత అంతా ఆయా జిల్లాల కలెక్టర్లపైనే ఉంటుంది. అది వక్ఫ్ ఆస్తులా లేదా ప్రభుత్వ భూములా అన్న విషయంలో కలెక్టర్లు మధ్యవర్తులుగా ఉండి ఆ సమస్యని పరిష్కరిస్తారు.




# ఖనిజాల ఉత్పత్తికి ప్రాధాన్యమిస్తున్నాం

- లక్ష్యాలను చేరుకోవడంలో ఖనిజరంగం కీలకం
- సవాళ్లను అధిగమిస్తూ పరిష్కార మార్గాలతో ముందుకెళ్దాం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఖనిజ రంగంలో విదేశాల నుంచి దిగుమతులు తగ్గించి, ఇక్కడే ఖనిజాల ఉత్పత్తికి ప్రాధాన్యమిస్తున్నామని, అందుకే కేంద్ర ప్రభుత్వం ఖనిజ రంగంలో పలు సంస్కరణలు చేపట్టిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో మైనింగ్, జియాలజికల్, మెటలర్జికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో.. గనులరంగంపై జరిగిన జాతీయ సదస్సులో విశిష్ట అతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి.. గనుల రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ లోనూ కేంద్ర ప్రభుత్వం 'క్రిటికల్ మినరల్ మిషన్', 'ఆఫ్ సోర్ మినరల్ బ్లాక్స్ వేలం' వంటి సంస్కరణలు తీసుకొచ్చిన విషయాన్ని కిషన్ రెడ్డి ప్రస్తావించారు. దీని ద్వారా కీలకమైన ఖనిజాల విషయంలో దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందన్నారు. దీనికితోడుగా విదేశాల్లోని గనులను లీజ్ కు తీసుకునే విషయంలోనూ ప్రగతి సాధించామన్నారు. భారతదేశంలో కోకింగ్ కోల్ దిగుమతిని తగ్గించేందుకు.. 'మిషన్ కోకింగ్ కోల్' కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. 2030 నాటికి 140 మిలియన్ టన్నుల కోకింగ్ కోల్ ఉత్పత్తి ఈ మిషన్ లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధికి, ఖనిజాల ఉత్పత్తికి ప్రాధాన్యతనిస్తూనే.. పర్యావరణ పరిరక్షణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. భారతదేశం 2047 నాటికి సంకల్పించుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో మన ఖనిజరంగం పాత్ర అత్యంత కీలకమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లుగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా బొగ్గు, గనుల రంగంలో సానుకూల మార్పులు కనబడుతున్నాయన్నారు. భారతదేశపు తలసరి విద్యుత్ వినియోగం ప్రపంచ సగటుతో పోల్చుకుంటే.. మూడోవంతుగా ఉందన్న కేంద్రమంత్రి.. భారతదేశంలో పెరుగుతున్న పారిశ్రామికీకరణ, అభివృద్ధి కారణంగా రానున్న రోజుల్లో ప్రపంచ సగటును భారత్ చేరుకోవడం ఖాయమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారతదేశంలో విద్యుదుత్పత్తిని పెంచేందుకు బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో గనుల తవ్వకం విషయంలో.. మొదటి దశ అయిన ఎక్స్ప్లొరేషన్ ప్రక్రియలో రిస్క్ తీసుకునేందుకు కంపెనీలు ముందుకు రావడం లేదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఎక్స్ప్లొరేషన్ ప్రక్రియలో 50 శాతం ఖర్చును భరించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి గుర్తుచేశారు. గనుల రంగంలో ఆత్మనిర్భరత సాధించేందుకు ఇలాంటి నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యూపీయే ప్రభుత్వంలో గనుల కుంభకోణాన్ని దృష్టిలో ఉంచుకుని, పారదర్శకమైన పద్ధతిలో వేలం విధానాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే, గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, బొగ్గు శాఖ అదనపు కార్యదర్శులు, కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్, ఎంజీఎంఐ అధ్యక్షుడు డాక్టర్ వీరారెడ్డితోపాటుగా బొగ్గు, గనుల రంగానికి చెందిన ప్రముఖులు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ గనుల యజమానులు పాల్గొన్నారు.



# కేరళ సీఎంను కలిసిన చిరంజీవి

- వయనాడ్ బాధితుల కోసం చెక్కు అందజేత

**విశాలభారతి, వెబ్ డెస్క్:**

మెగాస్టార్ చిరంజీవి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ను కలిశారు. వయనాడ్ బాధితుల కోసం తన వంతు బాధ్యతగా రూ. కోటి చెక్కును సీఎంకు అందజేశారు. అలా ఈ ఇద్దరు కాసేపు పలు అంశాలపై చర్చించుకున్నారు. కాగా, భారీ వర్షాల వల్ల కేరళలోని వయనాడ్లో కొండచరియలు విరిగిపడి వందల మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది. దీంతో బాధితులను ఆదుకునేందుకు సినీ ప్రముఖులు ముందుకొచ్చారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్కు తమ వంతుగా విరాళాలను ఇచ్చారు. అలా తన కుమారుడు రామ్ చరణ్తో కలిసి చిరంజీవి కూడా రూ. కోటి విరాళాన్ని ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు తాజాగా సీఎంను నేరుగా కలిసిన చిరు చెక్కును అందించారు. ఇంకా ప్రభాస్, అల్లుఅర్జున్, విక్రమ్, సూర్య, మోహన్లాల్, కమల్హాసన్, నయనతార, ఫహాద్ఫాజిల్, రష్మిక తదితరులు కూడా వయనాడ్ బాధితులకు తమ వంతు సాయంగా విరాళాలు ప్రకటించారు.



# బుద్ధదేవ్ భట్టాచార్య ఇక లేరు

- 11 ఏండ్లు బెంగాల్ సీఎంగా బాధ్యతలు
- కొంతకాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితం
- సీపీఎం పొలిట్ బ్యూరోలో సుధీర్ఘకాలం సేవలు
- మృతికి సీపీఎం నేతల సంతాపం

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య (80) గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన కోల్కతాలోని తన నివాసంలో కన్నుమూశారు. ఈమేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం వెల్లడించారు. భట్టాచార్య 20002011 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు సుచేతన్ ఉన్నారు. సీపీఎంలో నిర్ణయాధికార విభాగం పొలిట్ బ్యూరోలో కీలకంగా వ్యవహరించారు. కమ్యూనిస్టు యోధుడు జ్యోతి బసు తర్వాత 2000 సంవత్సరంలో బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2011లో జరిగిన ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయింది. 34 ఏళ్ల కమ్యూనిస్టు రూల్కు ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చెక్ పెట్టింది. దీంతో క్రమంగా భట్టాచార్య ప్రజాజీవితం నుంచి దూరమయ్యారు. కొన్ని సంవత్సరాలుగా ఆయన ఆరోగ్యం సరిగా లేదు. చూపు మందగించింది. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. బుద్ధదేవ్ కోల్కతాలోని ప్రెసిడెన్సీ కాలేజ్ పూర్వ విద్యార్థి. ఆయన పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి అడుగుపెట్టేముందు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1977లో తొలిసారి కాశిపుర్బెల్గాచియా నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంచలంచెలుగా తన వృత్తి జీవితంలో ఎదిగిన బుద్ధదేవ్.. జ్యోతి బసు ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2001, 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చారు. ఆయన అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారు. బాలీగంజ్ లోని చిన్న ఇంట్లోనే నివసించేవారు. సీఎంగానూ అక్కడి నుంచే విధులు నిర్వర్తించారు. ఇప్పుడు అక్కడే తుదిశ్వాస విడిచారు.

# ట్రాఫిక్ వల్లే ప్రమాదాలు

- అండర్ పాస్, ఓవర్ బ్రిడ్జీలు నిర్మించాలి
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



హైదరాబాద్ నగరంలోని జోడిమెట్ల చౌరస్తా సమీపంలో పది ఇంజినీరింగ్ కాలేజీలకు సంబంధించిన దాదాపు 60 మంది విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మరణించారని, హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ పెరిగిపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగాయని, అందుకోసం అండర్ పాస్, ఓవర్ బ్రిడ్జీల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఆయన గురువారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రికి పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. విజయవాడ నేషనల్ హైవేపై రెండు ఓవర్ బ్రిడ్జీలు, అలాగే ఛత్తీస్గఢ్ హైవేపై రెండు, కొంపల్లి నుంచి నాగపూర్ హైవేపై ఓవర్ బ్రిడ్జీల నిర్మాణం చేయాలని రాజేందర్ కోరారు.

# గ్రామపంచాయతీ కార్మికులు ఒక్కరోజు సఫాయి బందు

**కోదాడ, విశాలభారతి:** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బచ్చల కూర స్వరాజ్యం తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ ఎండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ఒక్కరోజు సమ్మె చేపట్టడం జరిగిందని అన్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు ఒక్కరోజు సమ్మె సపాయి బందు సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని కరోబార్, బిల్ కలెక్టర్లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగాను, జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలని, అర్హులుగా గుర్తించాలని విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ 10 లక్షల నష్టపరిహారం ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఒక్కరోజు సఫాయి బంద్ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ ఎండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బండారు గురువమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు వాసిమేకల వెంకటేశ్వర్లు, జిపి వర్కర్స్ మండల అధ్యక్షుడు ఎల్ నాగార్జున్, కార్యదర్శి మామిడి వెంకన్న, డి రవి, పి నరసయ్య, ఎన్ గోపిరెడ్డి, జె బజార్, ఎస్ రామారావు ఎస్ రఘు, శ్రీను, ఎం ముత్తయ్య, మరియమ్మ, నాగేంద్ర, షేక్ సైదమ్మ, ఎం వెంకట్రెడ్డి, రేణుక, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.





## సీజనల్ వ్యాధులపై అవగాహన

■ **మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్**

**సూర్యాపేట, విశాలభారతి:** పట్టణంలోని స్థానిక 1,9 వార్డులలో ఏర్పాటుచేసిన స్వచ్ఛదనంపచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు గురువారం వీధి కుక్కల సంతాన నిర్మూలన, సీజనల్ వ్యాధుల అవగాహన సదస్సుల కార్యక్రమాన్ని హాజరైన సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ శ్రీనివాస్ తోపాటు మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్ 9వ వార్డులో గల ప్రాథమిక పాఠశాల పరిసరాలలో బ్లీచింగ్ పౌడర్ వేసి వార్డులో గల వర్షపు నీరు నిలువ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేశారు. కాలువలలో దోమల మందు స్ప్రే చేశారు. 1వ వార్డు కౌన్సిలర్ వేములకొండ పద్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో పిల్లలకు మరియు వార్డులోని మహిళలకు సీజనల్ వ్యాధుల పై అవగాహన సదస్సు కల్పించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సుమంత్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ సురేష్, టీఎంసీ శ్వేత తదితరులు పాల్గొన్నారు.



## వైద్యులకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చి గుర్తింపు పత్రాలు ఇవ్వాలి

■ **సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ**

**డోర్నకల్ ,విశాలభారతి:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకి ప్రాథమిక చికిత్స అందిస్తూ, ఎన్నో సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేస్తున్న ఆర్ఎంపీ డాక్టర్లకు పీఎంపీ డాక్టర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం లో ఇచ్చిన మాట ప్రకారం. గ్రామీణ ప్రాంత వైద్యులు ప్రభుత్వం శిక్షణ ఇచ్చి వారికి గుర్తింపు పత్రాలు జారీ చేసి, గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక అత్యవసర సేవలందిస్తున్న. ఆర్ఎంపి పి.ఎం.పి డాక్టర్లకు గౌరవ వేతనం కూడా ఇచ్చి వారిని ఆదుకోవాలని అదేవిధంగా మండల కేంద్రంలో ఒకరిద్దరి ఆర్ఎంపి పి.ఎం.పి డాక్టర్ల వల్ల ఆర్ఎంపి పిఎంపి వ్యవస్థలకు మొత్తానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఆర్ఎంపి పి.ఎం.పి డాక్టర్లు వ్యవహరించకూడదని, వారి పరిధిలో ఉన్న వైద్యాన్ని మాత్రమే చేయాలని వాళ్లు పరిధికి మించి వైద్య చికిత్స చేయకుండా ఆ వైద్యానికి సంబంధించిన వైద్యం కోసం ప్రభుత్వ వైద్య కేంద్రానికి లేదా జిల్లా వైద్య కేంద్రాలకు హాస్పటల్ సిఫార చేయాలని ఆర్ఎంపి పి ఎంపీ డాక్టర్లకు సమాజానికి ప్రజలకి మంచి పేరుతో ప్రాథమిక చికిత్స అందించాలి ఆర్ఎంపి డాక్టర్ లు మీద ఉన్న విశ్వాసాన్ని నమ్మకాన్ని పెంపొందించాలని ఆర్ఎంపీ డాక్టర్ల డిమాండ్లకు హక్కులకై సిపిఐ పార్టీ పక్షాన పోరాటం చేయడానికి నిరంతరం సహకరిస్తామని, చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పట్టణ కార్యదర్శి రషీద్, యాకన్న, దయాకర్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.



## మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలి

**నడిగూడెం, విశాలభారతి:** గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ మల్లెల వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయం వద్ద మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన ఒకరోజు దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జీవో నెంబర్ 51 సవరణ చేసి .మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని,కారోబార్ బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ కల్పించాలని కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు.జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఐదు లక్షల ఇన్సూరెన్స్ అమలులోకి తీసుకురావాలని దహన ఖర్చులు 10000 నుండి 20 000 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రమును ఎంపీడీవో సయ్యద్ ఇమామ్ కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు చీమట నాగరాజు, గ్రామపంచాయతీ కార్మికులు వెంకన్న, కమలాకర్, మధుసూదన్, పి వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్యవంతమైన సమాజానికి తల్లిపాలు దోహదం

**తొర్రూరు, విశాలభారతి:** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు దోహదపడతాయని అమర్ సింగ్ తండా మాజీ సర్పంచ్ హాపావత్ సురేష్ అన్నారు. తల్లి పాల వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం మండలంలోని అమర్ సింగ్ తండా లోని అంగన్వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ శిశువు పుట్టిన దగ్గర నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డ మానసిక, శారీరకంగా ఎదుగులకు ఉపయోగపడతాయన్నారు. చాలా మంది తల్లులు పిల్లలకు తేనె, నీళ్లు వంటివి పడుతుంటారని, అలా చేయడం వల్ల బిడ్డ అనారోగ్యానికి గురవుతారన్నారు. రెండేళ్ల నుంచి బిడ్డకు అనుబంధ పోషకాహారాన్ని అందించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జే కమలాదేవి, వి భారతి, విజయ, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు కీర్తన, త్రివేణి, ఉమాదేవి, ఏఎన్ఎం స్వరూప, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.




## సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

■ **ఎస్ఐ జి అజయ్ కుమార్**

**నడిగూడెం, విశాలభారతి:** సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అజయ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల బారిన పడకుండా నగదు కోల్పోకుండా వ్యక్తిగత సమాచారం వివరాలు బయటి వ్యక్తులకు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోన్ యాప్స్ గురించి ఆన్లైన్ గేమ్స్ గురించి, ఫోను కు వచ్చిన ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని,ఒకవేళ పొరపాటున నగదు కోల్పోయిన 1930 కి కాల్ చేసి నగదు కోల్పోయిన వివరాలు చెప్పగలరు. ఈ కార్యక్రమంలో గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వాణి,ఏఎస్ఐ లు మల్సూర్, జగన్నాథం, వీరబాబు, ఉపాధ్యాయ సిబ్బంది ఇంటర్మీడియట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు అన్ని సదుపాయాలు అందుతాయి

■ **గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి**

**భద్రాచలం, విశాలభారతి:** ఎటపాక మండలం గుండాల సచివాలయంలో స్థానిక సర్పంచ్ , పురుషోత్తపట్నం సర్పంచ్ ఆధ్వర్యంలో ముందస్తు వరదలు , పారిశుద్ధ్యం అనే అంశాల మీద స్థానిక ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విపరీతంగా కురుస్తున్న వర్షాల కారణంగా, వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, అలుగులు, బాగా పొంగిపొర్లుతున్నాయి కావున ప్రజల అటువైపునకు వెళ్లకూడదని గోదావరి కూడా మళ్లీ పెరిగే అవకాశాలు ఉన్నాయి కావున వరద ముంపునకు గురయ్యేటు వంటి కుటుంబాలు ఏవైతే ఉన్నాయో వారందరూ కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అంతే కాకుండా వర్షాకాలంలో ఇంట్లో మన పరిసరాలలో వర్షపు నీటిని నిల్వ ఉంచకుండా చూడాలని, ఒకవేళ ఉన్నట్లయితే, ఆ నిల్వ ఉన్న నీటిలో చిన్న పురుగులుగా తయారై, తద్వారా దోమలుగా తయారయ్యే ప్రమాదం ఉంటుందని సూచించారు. అంతేకాకుండా వర్షాల కారణంగా ఆస్తమానం తడవడం వలన విష జ్వరాలు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి కావున జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మరియు ఇళ్లలో దోమల బారి నుండి కాపాడుకొనుటకు దోమతెరలు ఉపయోగించాలని సూచించారు.



## పదాతిదళాల సైనిక అధికారులకి శిక్షణ ప్రారంభం..

■ **మూడు నెలపాటు శిక్షణ...**

**చిగురుమామిడి, విశాల భారతి:** సహకార నిర్వహణ సంస్థ, కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, రాజేంద్రనగర్ ఆవరణలో గురువారం భారత వాయు, నౌక, పదాతి దళాల సైనిక అధికారులకి, కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 4మాసాల శిక్షణ కార్యక్రమం ప్రారంభం కార్యక్రమానికి పి ఉదయ్ కుమార్, ఐ.ఏ.యస్ తెలంగాణ రాష్ట్ర రిజిస్టార్ అఫ్ కోఆపరేటివ్స్ జాయింట్ సెక్రటరీ, తెలంగాణ ప్రభుత్వం ముఖ్య అతిధిగా హాజరు అయినారు. ఈశిక్షణ కార్యక్రమంలో దేశంలోని 10 రాష్ట్రాలలో విధులు నిర్వహిస్తున్న మూడు దళాల సైనిక అధికారులు పాల్గొంటున్నారని, వీరి ఉద్యోగ విరమణ అనంతరం పునరావాస కార్యక్రమంలో భాగముగా ఈకార్యక్రమం నిర్వహించడం జరుగుచున్నదని డాక్టర్ శ్రీనివాస్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ వ్యాపార నిర్వహణలో కృషి, వ్యాపార దక్షతతో కూడిన ఆర్థిక క్రమశిక్షణ వలన మేలు జరుగుతుందని రిజిస్ట్రార్ అఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ అభి ప్రాయపడినారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అకౌంటింగ్, కాస్టింగ్, మార్కెటింగ్,బిజినెస్ మోడల్స్ వంటి అంశాల పై అవగాహన కల్పిస్తామని శ్రీ సురేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరములో అయిదు కార్యక్రమాలు కేంద్ర రక్షణ శాఖ కేటాయించినట్లు డాక్టర్ ఆర్. గణేశన్, డైరెక్టర్ అన్నారు. జాతీయ గీత ఆలాపనతో కార్యక్రమం ముగిసిందని తెలిపారు.




## కాంగ్రెస్ కండువా కప్పుకున్న ధర్పల్లి సొసైటీ చైర్మన్

**ధర్పల్లి విశాల భారతి** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్.ఆర్.భూపతిరెడ్డి, ధర్పల్లి మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్ సమక్షంలో ధర్పల్లి సొసైటీ చైర్మన్ చెలిమెల మల్లికార్జున్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో చెలిమెల నర్సయ్య, మిట్టపల్లి గంగారెడ్డి, పుప్పల సుభాష్, చెలిమెల శ్రీనివాస్,సురేందర్ గౌడ్,రాములు, సొసైటీ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.




## ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చేయండి

■ **ఆదివాసి సంక్షేమ పరిషత్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమాదేవి**

**భద్రాచలం, విశాలభారతి:** ఐటిడిఎ, ఆదివాసి సంఘాల ఐక్యవేదిక సమన్వయంతో నిర్వహిస్తున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆదివాసి సంక్షేమ పరిషత్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలం కేంద్రంగా జరిగిన మహిళ నాయకుల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆదివాసీలు ప్రతి గ్రామం నుండి వేలాదిగా తరలిరావాలని ఆదివాసుల పండుగ రోజున ఉత్సాహంగా నిర్వహించుకోవాలని ఆమె అన్నారు. ఆగస్టు 9వ తారీఖున అంబేద్కర్ సెంటర్ నుండి భద్రాచలం పురవీధుల గుండా భారీ ర్యాలీ పిఓ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలతో కూడిన డోలు కొయ్యలు రేలా నృత్యాలతో ప్రదర్శన జరుగుతుందని ప్రతి ఒక్కరు ఈ ఆకుపచ్చ వస్త్ర ధారణతో భద్రాచలం ఆకుపచ్చమయం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన మహిళా నాయకులు కణితి రాధా, మహా జన సమితి ఆదివాసి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి, జిల్లా అధ్యక్షులు పలక ఆదిలక్ష్మి, ఆదివాసి సేన అధ్యక్షురాలు చింత అరుణ, కోడి శ్రీదేవి, మీడియం నాగమణి, వాసం స్వప్న, మడివి సాయి రేఖ, తదిర్లు పాల్గొన్నారు.

## సున్నం లక్ష్మయ్య మృతికి సంతాపం

**భద్రాచలం, విశాలభారతి:** సీనియర్ కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సున్నం లక్ష్మయ్య అకాల మృతికి సంతాపం ప్రకటించిన గోండ్వాన సంక్షేమ పరిషత్ ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సోందె వీరయ్య, పాయం సత్యనారాయణలు భద్రాచలం జగదీష్ కాలనీలో గురువారం తెల్లవారుజామున మృతి చెందిన సీనియర్ కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సున్నం లక్ష్మయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించినారు. ఈ సందర్భంగా సొంది వీరయ్య మాట్లాడుతూ ఏజెన్సీలో సుదీర్ఘంగా భద్రాచలం డివిజన్లో కామ్రేడ్ ముర్ల ఎర్రయ్య రెడ్డి నాయకత్వంలో సిపిఐ ఎంఎల్ పార్టీ డివిజన్ కార్యదర్శిగా పనిచేస్తూ ఆదివాసుల పోడు భూముల విషయంలో రాజీలేని పోరాటాలలో పాల్గొన్నారనారు. చివరి దశకములో



నిజమైన కమ్యూనిస్టు యోధుడుగా పేదల పక్షాన నిలబడిన డివిజన్ లో కురువృద్ధుడు సున్నం లక్ష్మయ్యకు నివ్వాళ్లర్పించి వారి ఆత్మ శాంతి చేకూరాలని సంతాపం ప్రకటించారు.




## రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

■ **బెల్లంకొండ వెంకటేశ్వర్లు సిపిఎం జిల్లా నాయకులు**

**నడిగూడెం, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు భరోసాను విడుదల చేసి రైతుల అకౌంట్ లో నగదు జమ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో వ్యవసాయానికి 1,50,000 కోట్లు మాత్రమే కేటాయించడం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు.బడ్జెట్ ను సవరించి వ్యవసాయ రంగానికి 25 శాతాన్ని కేటాయించాలన్నారు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కనీస మద్దతు ధర చట్టం చేయాలని, రైతాంగానికి ఉన్న అన్ని అప్పులను మాఫీ చేయాలని రైతులకు 55 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని కోరారు.దేశ రాజధానిలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగ పోరాడుతున్నప్పటికీ గతంలో బిజెపి ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీలను నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు. రైతాంగానికి వరి పంటకు బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చెప్పిందని వానాకాలం నుండే బోనస్ అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయానికి డీజిల్ సబ్సిడీ ధరకే అందించాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, ఏనుగుల వీరాంజనేయులు ఎస్కే మస్తాన్ బొడ్డు వెంకటనారాయణ,తదితరులు పాల్గొన్నారు.



## మహేష్ బాబు జన్మదిన సందర్భంగా వినూత్న కార్యక్రమాలు

**వనపర్తి, విశాల భారతి::** తెలుగు వెండితెరపై ఉత్తమ నటునిగా ఎంతో పేరు ప్రతిష్టలు కలిగిన ప్రిన్స్ మహేష్ బాబు 49వ జన్మదిన వేడుకలను ఆయన ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ సాగర్ తెలిపారు. మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యం నుంచి మహేష్ బాబు నూతనంగా నిర్మించే ప్రతి సినిమాను కోలాహాలంగా సాగుతూ పండగలా నిర్వహిస్తామన్నారు. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా నేడు మురారి సినిమాను అభిమానుల కోసం ప్రేక్షకుల కోసం రీ రిలీజ్ చేస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు ప్రిన్స్ మహేష్ బాబు అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంతో పాటు వృద్ధులకు, అనాధలకు పండ్లు కంపెనీ చేస్తామన్నారు. అనంతరం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.






## వీధి కుక్కల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవాలి

- **వీధి కుక్కల జన సంతతిపై శాస్త్ర చికిత్సలు నిర్వహించాలి**

**వనపర్తి, విశాల భారతి::**వీధి కుక్కల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.గురువారం వనపర్తి పట్టణంలోని నాగవరం శివారు ఉరగుట్ట వద్ద కొత్తగా నిర్మితమైన జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి పరిశీలించారు. జిల్లాలో వీధి కుక్కల సంతతిని తగ్గించడానికి రోజుకు కనీసం 10 కుక్కలకు జనన నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని నలుమూలల నుండి వీధి కుక్కలను తీసుకు వచ్చి సురక్షితమైన పద్ధతిలో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఎనిమల్ వెల్ఫేర్ కేర్ సెంటర్ ఏజెన్సీతో ఒప్పందం చేసుకోవడం జరిగింది. శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు, సిబ్బందిని సమకూర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిని సూచించారు.

**సెగ్రిగేషన్ షెడ్ ను వినియోగంలోకి తీసుకురావాలి:** సెగ్రిగేషన్ షెడ్ ను తక్షణమే వినియోగంలోకి తీసుకు రావాలని, తడి చెత్త, పొడి చెత్త ను వేరు చేసి ప్లాస్టిక్ ను అమ్మేయడంతో పాటు తడి చెత్త నుండి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. మున్సిపాలిటీ నుండి రోజుకు ఉత్పత్తి అయ్యే చెత్త ఎంత, ఎన్ని క్వింటాళ్ల చెత్తను సేకరిస్తున్నారు అనే పూర్తి వివరాలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా బయో మైనింగ్ ను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జెడ్పి సీఈవో యాదయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## బిజెపి ప్రభుత్వం దళితుల బడ్జెట్ ను పున:సమీక్షించాలి

- **జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలి**
- **వనపర్తి జిల్లా కేంద్రం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన**

**వనపర్తి, విశాల భారతి::**కేంద్ర బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించకుండా ద్రోహం చేసిందని ఆ బడ్జెట్ సమీక్షించి సవరించాలని వ్యవసాయ కార్మిక సంఘం కెవిపిఎస్ ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రం అంబేద్కర్ విగ్రహం ముందు కేంద్ర ప్రజా సంఘాల పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గంధం భగత్, ఐద్వా జిల్లా కార్యదర్శి A లక్ష్మి మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సమర్పించిన 202425 బడ్జెట్ దళిత సమాజాన్ని పూర్తిగా విస్మరించి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందని అన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని పెరుగుతున్న ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లకు పార్లమెంటులో చట్టం చేయాలని ప్రభుత్వరంగ ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు గంధం ఘట్టన్న బీసన్న, ఐద్వా జిల్లా అధ్యక్షులు గద్వాల సాయిలీల, రమేశ్, శంకర్, బిచ్చన్న బాలయ్య పాల్గొన్నారు.



## బుద్ధారం గండిని టూరిజం హబ్ గా మార్చుకుందాం

- **ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటుకు పూర్తయిన సర్వేలు**

**వనపర్తి, విశాల భారతి::** రానున్న కాలంలో గోపాల్పేట మండలం బుద్ధారం గండి ప్రాంతాన్ని టూరిజం హబ్ గా మార్చుకుందామని.. ఇప్పటికే బుద్ధారం గండిలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు కోసం భూ సర్వే పూర్తయిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం గండి ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులకు శాలువాలు పూలమాలలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గండి ఆంజనేయస్వామి ఆలయం రానున్న కాలంలో టూరిజం హబ్ గా మారబోతుందని అందుకు పర్యాటక శాఖ నుంచి ఇప్పటికే రెండు కోట్ల రూపాయలకు ప్రతిపాదనలు త్వరలోనే హరిత హోటల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు



## నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

- **సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్**

**సూర్యాపేట, విశాలభారతి** సూర్యాపేట పట్టణంలోని 24 వ వార్డులో వేస్తున్న సీసీ రోడ్లు నాణ్యత ప్రమాణాలతో ఉండటం లేదని గత ఆరు నెలల క్రితం వేసిన రోడ్డును మళ్లీ వేస్తున్నారని, నాణ్యతతో రోడ్లను వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం పార్టీ వన్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో 24వ వార్డులో వేస్తున్న సిసి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో సీసీ రోడ్లు వేయవలసి ఉండగా కాంట్రాక్టర్లు,అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై సరియైన పద్ధతిలో ఇసుక,సిమెంటు, కంకర కలపకుండా రోడ్లు వేయడం మూలంగా రోడ్లు వేసిన 6 నెలలకే పెచ్చులు లేచి గుంతలుగా మారుతున్నాయనిఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు సిసి రోడ్ల కోసం కేటాయిస్తుంటే నాణ్యత ప్రమాణాలతో నిర్మించాల్సిన కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలకు తిలోగాలు ఇవ్వడం మూలంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న కోట్లాది రూపాయలు బూడిదలు పోసిన పన్నీరుల అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమేనాణ్యత ప్రమాణాలకు పాల్పడని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్లకు ఆశపడి అధికారులు కాంట్రాక్టర్లల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని విమర్శించారు. తక్షణమే సీసీ రోడ్ల నిర్మాణం లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వన్ టౌన్ కమిటీ సభ్యులు అర్వపల్లి లింగయ్య, సాధనాల లింగయ్య, మామిడి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- **పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం**
- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, విశాల భారతి::** జిల్లాలో దోమల నివారణ కోసం ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ప్రతి ఇంట్లో తమ పరిసరాల్లో నిలువ నీరు లేకుండా చూసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా గురువారం ఆరోగ్య సంరక్షణ దినోత్సవంగా పాటిస్తూ స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మహిళా సమాఖ్య సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... సోమవారం నుండి ప్రారంభమైన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం రేపు డ్రై డే వరకు నడుస్తుందన్నారు. నిలువ నీటిలో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా కారకులైన దోమలు గుడ్లు పెట్టీ వ్యాప్తి చెందుతాయని వాటిని నివారించడానికి పరిసరాల్లో నిలువ నీరు లేకుండా చూసుకోవడం ఒక్కటే మార్గమని తెలిపారు. అందువల్ల ప్రతి శుక్రవారం ప్రతి ఒక్కరూ డ్రై డే లో భాగస్వాములై నిలువ నీటిని శుభ్రం చేసుకునే విధంగ మహిళా సంఘాల సభ్యులు చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లాలో మహిళా సంఘాలకు విశేష ప్రాముఖ్యత ఉందనీ దాదాపు లక్షల మంది మహిళలు మహిళా సంఘాల్లో ఉంటారు. అందువల్ల మహిళా సమాఖ్య సభ్యులు ప్రతి మహిళ సంఘం సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత గంగ్వార్ మాట్లాడుతూ దోమల వల్ల ప్రాణాంతక డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి ప్రాణాంతక అంటు వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సి. ఈ. ఓ యాదయ్య, పి.డి. డి.ఆర్డీఓ ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జయచంద్ర మోహన్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యమ్మ, డా. సాయినాథ్ రెడ్డి, మండలం నుండి ముగ్గురు చొప్పున మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలి

- **వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలోనిరసన**

**సూర్యాపేట, విశాలభారతి** ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో దళితుల, వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, కెవిపిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి కోటగోపి ఆరోపించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లాల బావి సెంటర్ లో బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 202425 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ దళిత సమాజాన్ని పూర్తిగా విస్మరించాయని, ఇది భారత రాజ్యాంగానికి స్పష్టమైన ఉల్లంఘనను బీజేపీ పాలనలో ప్రతిబింబిస్తుందనీ అన్నారు. భారతదేశంలోని దళితులు ప్రధానంగా వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగాలలో ఉపాధి పొందుతున్నారని, ఇది వారి నిరంతర సామాజిక, ఆర్థిక అట్టడుగున జీవనం విధానం ఉన్నట్లు అర్థమవుతుందని అన్నారు. గతంలో కేటాయించిన బడ్జెట్ ప్రకారం కేటాయించిన నిధులు కూడా తరచుగా తగ్గించబడుతున్నాయని అన్నారు. నీతి అయోగ్ సిఫార్సుల ప్రకారం దళితుల జనాభా ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు రావాల్సిన కేటాయింపులు దాదాపు 16.2% ఉన్నాయి కానీ పైన పేర్కొన్న షెడ్యూల్డ్ కులాల కోసం అంచనా వేసిన కేటాయింపులు గత 10 సంవత్సరాల బడ్జెట్ అంచనాలలో బడ్జెట్ లో 11% దాటలేదని అన్నారు. ఎస్సీలకు కేటాయించిన మొత్తం రూ. 1,65,493 కోట్లు, ఇది దాదాపు మధ్యంతర బడ్జెట్ కు సమానంగా ఉంటుంది. బడ్జెట్ కేటాయింపులు, వ్యయాలను పెంచాలని, షెడ్యూల్డ్ కులాల సబ్ ప్లాన్ (ఎస్సిఎస్పి)ని జాతీయ స్థాయిలో అమలు చేయాలని, ప్రయివేటు రంగంలో దళితులకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దళితులపై అఘాయిత్యాలు జరగకుండా నిరోధించడానికి ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి ఎం పి ఎస్ జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి, సిఐటియు జిల్లా నాయకులు వల్లపు దాసు సాయికుమార్, కేవీపీఎస్ జిల్లా నాయకురాలు ఇరుగు రమణ, సురేష్, సిఐటియు నాయకులు కోడి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




## అంబేద్కర్ అభయ హస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలి

- **చింతపల్లి బిజెపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు**

**చింతపల్లి, విశాల భారతి** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చింతపల్లి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు ఏర్పుల యాదగిరి ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ అర్షద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేవెళ్ల బహిరంగ సభలో ఎస్సీ డిక్లరేషన్ ప్రకటించడం జరిగింది. షెడ్యూల్ కులాలకు ఉపాధి కల్పిస్తామని అన్ని రంగాలలో అవకాశాలు తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల లోపల డిక్లరేషన్ లో పొందుపరిచిన అన్ని హామీలను నూటికి నూరు శాతం అమలు చేస్తామని చెప్పి మోసపూరిత హామీలు, వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చి నేటికీ ఎనిమిది నెలలు కావస్తున్నా ఎస్సీలకు ఎలాంటి హామీలు అమలు చేయకుండా నిద్ర మత్తులో ఉన్నది అన్నారు. అంబేద్కర్ అభయా హస్తం పథకం కింద ఎస్సీ కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని అదేవిధంగా ప్రభుత్వ అన్ని కాంట్రాక్టులలో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఇందిరమ్మ పక్క ఇళ్ల పథకం ద్వారా ఇల్లులేని ప్రతి ఎస్సీ కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం 6 లక్షల రూపాయలు అందించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఉధృతస్థాయిలో నిరసన కార్యక్రమాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు గాధరి జంగయ్య, ఓ బి సి సెల్ కార్యదర్శి వెన్నమ్ శేఖర్,జిల్లా నాయకులు మసాని సైదులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

**వనపర్తి , విశాల భారతి:** గత మూడు రోజులుగా కల్వకుర్తి ఎత్తిపోతల ప్రధాన కాలువలపై పర్యటిస్తూ, పంట కాలువలు, రెగ్యులేటర్లను కాలువల పటిష్టతను ఎమ్మెల్యే మేఘ రెడ్డి పరిశీలించారు. గోపాల్పేట మండలంలోని జాకీర్ధర్ కాలువ గుడిపల్లి రిజర్వాయర్ D8, D5 ప్రధాన కాలువలతో పాటు బుద్ధారం కుడి ఎడమ కాలువల పరిశీలన, పెద్దమందడి, ఖిల్లా ఘనపురం, మామిడమాడ నేరుడు చెరువు, మున్ననూర్, తిరుమలాపూర్, చందాపూర్, ఖాన్ చెరువు, కాలువల నిర్మాణాల పరిశీలనను ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడుతూ.. 15 రోజుల వరకు రైతులకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని అధికారులు నిరాటంకంగా నీటిని విడుదల చేయాలని వారిని ఆదేశించారు. కాలువల వెంట ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నిధుల మంజూరి గురించి ఆలోచించకుండా పనులు చేయాలని నిధుల గురించి తను చూసుకుంటానని ఎమ్మెల్యే అధికారులకు భరోసా కల్పించారు. రైతులు ఎవ్వరు కూడా అధైర్య పడకూడదని నియోజకవర్గ పరిధిలోని ప్రతి చెరువుకు నీరందించేందుకు తాను వ్యక్తిగత బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త వనపర్తి పట్టణ అధ్యక్షులు వనపర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మున్సిపల్ కౌన్సిలర్స్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నాయకులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- **భీమ్‌గల్ ఎస్సై హరిబాబు**

**బాల్కొండ, విశాల భారతి:** భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ మోసాలు ,మత్తు పదార్థాలు,ర్యాగింగ్ అంశాలపై భీమ్‌గల్ ఎస్సై హరిబాబు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్లు వచ్చాయన్నారు. ఇప్పుడు సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ ఉన్నదని,దీనికి రెట్టింపుగా సైబర్ నేరగాళ్ల సంఖ్య కూడా పెరుగుతున్నదన్నారు. ఏదో ఒక లింక్ పంపించి,ఆశ చూపడంతో అమాయక యువత వారి ఉచ్చులో పడి నిలువునా దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. గంజాయి,మద్యం ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఒకసారి డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటే జీవితాలు నాశనం అయిపోతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీను, జలపాతి ,శ్రీకాంత్,బిక్యా,రాజశేఖర్, ఉపాధ్యాయుల సిబ్బంది పాల్గొన్నారు.



## సిఎం రేవంత్ అమెరికా పర్యటనలో సునీల్

**బాల్కొండ,విశాలభారతి:**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా అమెరికా పర్యటన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో ఆయన గత వారం రోజుల నుండి అమెరికా లోనే పర్యటిస్తున్నారు.



## విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన

**భీమదేవరపల్లి, విశాల భారతి** మండలంలోని వంగర గ్రామంలోని పివి రంగారావు,ముల్కనూర్ కస్తూర్బా హాస్టల్ లో గురువారం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లెప్రసి అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలన పై అవగాహన కల్పించారు. డాక్టర్ రుబీనా రెహమాన్ మాట్లాడుతూ.. హాస్టల్లో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత పై ఆవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని ఇవ్వాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, ఫాతిమా, డిపిఎంవోలు, హనుమారెడ్డి, రవీందర్ ,మోహన్, ఆశా కార్యకర్తలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కోటి ఇరవై లక్షలతో 5.0ఎంవిఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం

**ధర్పల్లి విశాల భారతి** దర్పల్లి మండలంలో గత కొంతకాలం నుండి వ్యవసాయ మోటార్ల లోడ్ పెరగడం వల్ల లోవోల్టేజ్ సమస్య తలెత్తింది. ఈ సమస్య శాశ్వతంగా పరిష్కరించడానికి విద్యుత్ శాఖ వారు రూ. కోటి ఇరవై లక్షలతో అదనంగా 5.0MVA పవర్ ట్రాన్స్ఫార్మర్ ను నిజామాబాద్ ఎస్ఈ ఆర్.రవీందర్ చేతుల మీదగా 33/11KV దమ్మన్నపేట సబ్స్టేషన్లో గురువారం చార్జ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఈ మాట్లాడుతూ.. ఈ ట్రాన్స్ఫార్మర్ బిగించడం వలన వ్యవసాయ రైతులకు, డొమెస్టిక్ వినియోగదారులకు, ఇండస్ట్రియల్ వినియోగదారులకు నిరంతరాయమైన, నాణ్యమైన విద్యుత్ అందించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ డిచ్ పల్లి ఉత్తం, ఎంటిఆర్ , ఏడిఈ డిచ్ పల్లి శ్రీనివాస్, ఎస్డిఈ ఎస్పిఎం నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ వాడకం నిషేధించేందుకు మహిళలు బాధ్యత వహించాలి

**వనపర్తి, విశాల భారతి::**సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు మహిళా శక్తి తమవంతు ప్రయత్నాలు చేయాలని అదనపు కలెక్టర్ సంచిత గంగ్వార్ సూచించారు. గురువారం వనపర్తి మండలం చిట్యాల గ్రామంలో జిజియా బాయి మహిళా సంఘం సభ్యురాలు శిరీష నెలకొల్పిన శ్రీ సాయి స్టీల్ బ్యాంక్ ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ స్టీల్ బ్యాంక్ ద్వారా వివిధ శుభ కార్యక్రమాలకు స్టీల్ పాత్రలు అద్దెకు ఇవ్వడం జరుగుతుంది. శుభ కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ను అధికంగా వాడేస్తామని, పడేసిన ప్లాస్టిక్ సులువుగా నాశనం కాకుండా పర్యావరణాన్ని కలుషితం చేస్తుంది. అందువల్ల ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు స్టీల్ వాడకం పెంచాలి అనే ఉద్దేశ్యంతో మహిళా సంఘం సభ్యురాలు వినూత్నంగా స్టీల్ బ్యాంక్ ను ఏర్పాటు చేయడం అభినందనీయము అన్నారు. అనంతరం అక్కడే పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పి.డి. డి.ఆర్డీఓ ఉమాదేవి, ఎడిషనల్ పి డి.భీమయ్య, ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ సుదర్శన్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చెన్నమ్మ, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## డయల్ 100 కాల్స్ పట్ల తక్షణమే స్పందించాలి

■ జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాలు

**వనపర్తి, విశాల భారతి:**రాష్ట్ర స్థాయి పోలీస్ అధికారులతో ఈ నెల 6 న డిజిపి హల్ఫ్ ఇయర్లీ నేర సమీక్ష సమావేశం నిర్వహించి పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత దగ్గరగా చేర్చి మెరుగైన సేవలను అందించేందుకు ఆయా కమిషనరెట్ ల సీపీలకు , జిల్లాల ఎస్పీ లకు ట్రాఫిక్ నియంత్రణ , డయల్ 100 కు తక్షణమే స్పందించడం, రౌడీ షీటర్స్ పై నిఘా ఉంచడం, సిబ్బంది సంక్షేమం, పోలీస్ వాహనల నిర్వహణ, ప్రాపర్టీ నేరాల చేధన , నియంత్రణ, ఎన్ బి డబ్ల్యూ ఎస్ సర్వ్ చేయడం, అధికారులు, సిబ్బందిని గ్రామాల ప్రజలతో కమ్యూనికేషన్ పెంచుకోవడం వంటి అంశాల పై సూచనలు చేసిన సందర్భంగా గురువారం జిల్లా ఎస్పీ, జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆయా అంశాలను మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ .. పోలీస్ అధికారులు, సిబ్బంది తమ పరిధిలో ఎక్కడ ఏమీ జరిగిన వెంటనే పోలీస్ లకు సమాచారం అందించేలా ప్రజలతో కమ్యూనికేషన్ పెంచుకోవాలని తద్వారా నేరాలను ముందే అంచనా వేసి నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. పబ్లిక్ కు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విజిబుల్ పోలిసింగ్ ను మరింత పెంచాలని, లా & ఆర్డర్ కు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే అంచనా వేయగలగాలి అని సూచించారు. ప్రజలు ఆపద సమయంలో ఉపయోగించే డయల్ 100 కాల్స్ పై ఎలాంటి అలసత్వం చూపొద్దని నిర్ణీత సమయంలో బ్లూ కోల్ట్స్/ పెట్రో కార్స్ సిబ్బంది అక్కడకు చేరుకొని సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. తమ పరిధిలో ఉన్నా రౌడీ షీటర్ ల పై నిరంతర నిఘా ఉండాలని అన్నారు. పోలీస్ అధికారులకు,సిబ్బందికి కేటాయించిన వాహనాల నిర్వహణ పకడ్బందీ గా ఉండాలని, ప్రాపర్టీ నేరాల జరగకుండా రాత్రి సమయాలలో విజిబుల్ పోలీసింగ్ ను పెంచాలని, ప్రాపర్టీ నేరాలు జరుగాకుండ నిఘా ఉంచాలని అన్నారు. అధికారులు,సిబ్బంది క్రమశిక్షణతో మెలగలి అనీ, పోలీస్ ఇమేజ్ ను తగ్గించే ఏలాంటి చర్యలకు పాల్పడిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు .ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పీ శ్రీరామదాసు తేజవాత్ డి. ఎస్పీ వెంకటేశ్వరరావు డి సి ఆర్ పి డి ఎస్ పి శ్రీ కృష్ణ కిషోర్ , ఎస్బి ఇన్స్పెక్టర్ ముని సిసిఎస్ ఇన్స్పెక్టర్ రవిపాల్ వనపర్తి సిఐ నాగభూషణం కొత్తకోట సిఐ రాంబాబు ఆత్మకూరు సిఐ శివకుమార్ జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సైలు పాల్గొన్నారు.

# ప్రజలకు మంచి చేస్తుంటే..ప్రభుత్వంపై విమర్శలా

■ బిఆర్ఎస్ నేతలకు కళ్ళు మంట



**భీమదేవరపల్లి, విశాల భారతి** తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మంచి చేస్తుంటే బీఆర్ఎస్ నేతలకు కళ్ళమంట ఎందుకని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ముల్కనూర్, మల్లారం రైతు వేదికలో గురువారం వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. వ్యవసాయ ఆధార అనుబంధ పనులపై, ఆర్థిక వృద్ధి పై దిశ నిర్దేశం చేసారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం మంచి చేస్తుంటే బిఆర్ఎస్ నేతలకు ఎందుకు కళ్ళు మండుతున్నా యని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి అమెరికా పర్యటనలో తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించి అనేక అంశాలు ముందడుగు పడుతుంటే కుటుంబ పరమైన అంశాలు ప్రస్తావిస్తూ చులకన చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర చీఫ్,ఫైనాన్స్ సెక్రటరీ ఐటీ పరిశ్రమలకు సంబంధించిన అధికారులతో అమెరికాకు వెళ్లి డెలిగేషన్స్ తో చర్చించి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తుంటే ,రాష్ట్రం ఎక్కడ బాగుపడుతుందో అని కళ్ళ మంటతో బిఆర్ఎస్ నేతలు అనేకమైన ఆరోపణలు ప్రభుత్వం పై చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బిఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని దాని ఆత్మ విమర్శన చేసుకోవాలని సూచించారు.

**బిజెపి మంత్రి కిషన్ రెడ్డి పై మండిపడ్డ పొన్నం:** రుణమాఫీ కాని వారు నిలదీయాలని అంటున్న కిషన్ రెడ్డి,కేసీఆర్ మాటలు మీ రూపంలో చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్,బిజెపి వేరు కాదని ప్రజలు కూడా అలా చూడడం లేదన్నారు. బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం జరుగుతే మాట్లాడే చేతకాని మంత్రి కిషన్ రెడ్డి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, అడిషనల్ డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో వీరేశం, అఫ్జల్ పాషా, సిడిపిఓ స్వరూప, ఎంపీ ఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక సదుపాయాలు కల్పించాలి

**బాల్కొండ,విశాలభారతి:**మౌలిక సదుపాయాలు కల్పించాలని బాల్కొండ మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూమ్ కాలనీ వాసులు గ్రామ పంచాయతీ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ డబుల్ బెడ్రూమ్ కాలనీలో మౌలిక సదుపాయాలైన త్రాగు నీరు, విద్యుత్,డ్రైనేజీ వాటి సదుపాయాలు కల్పించాలని అన్నారు. సరియైన డ్రైనేజీ లేకపోవడంతో వర్షపునీరు నిల్వ ఉండి కాలనీలో బురద గుంటలు ఏర్పడి దోమలు,పందులు,కుక్కలు అక్కడే నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నాయని,దీంతో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు కానీ మౌలిక సదుపాయాలు కల్పించాలేక పోతున్నారని తెలిపారు.ఇకనైనా కాలనీలో తమకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని స్థానిక పంచాయతీ అధికారికి విన్నవించారు. అనంతరం ఎంపిడివోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటిన పోలిసులు

**దేవరుప్పుల, విశాల భారతి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనంపచ్చదనం' కార్యక్రమంలో భాగంగా గురువారం దేవరుప్పుల మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసి మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఏసిపి నర్సయ్య పాల్గొని సీఐ మహేందర్ రెడ్డి,ఎస్సై సృజన్ కుమార్ లతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మనం నాటిన మొక్కలు భవిష్యత్తు తరాలకు ఎంతగానో ఉపయోగ పడుతాయని,ఒక చెట్టు సంవత్సరానికి 25 కిలోల కార్బన్ డై ఆక్సయిడ్ ను పీల్చుకుని వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుందని,ఈ మొక్కలే రేపటి వృక్షాలై భావితరాల వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయని,నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్సై సదానందం,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్,సిబ్బంది యాకూబ్, మసూద్, అశోక్, కుమార స్వామి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

■ సుధీర్ కుమార్

**కరకగూడెం, విశాలభారతి :** అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని డివిజనల్ పంచాయితీ అధికారి సుధీర్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని 16 గ్రామపంచాయతీలలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రహదారులు గుంతలు ఏర్పడడంతో వాటిని పరిశీలించి కొలతలు తీసుకున్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో మురికి కుంటల్లో గంబుసియా చేప పిల్లల్ని వదిలారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా భట్టుపల్లి పాఠశాలలో ఇంకుడు గుంతకు శంకుస్థాపన చేశారు. మండల వ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని వారిని నిత్యం పర్యవేక్షించాలని ఇన్చార్జ్ ఎంపీడీవో దేవ వర కుమార్ కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.

## పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

**సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్, ఎస్పీ సూర్యాపేట**

**సూర్యాపేట, విశాలభారతి** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నందు పోలీసు సిబ్బందితో కలిసి జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ , అదనపు ఎస్పీ నాగేశ్వరరావు మొక్కలు నాటినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల అడువల వృద్ధి పెరుగుతుంది, కాలుష్యం నివారించవచ్చు, పర్యావరణానికి పరిరక్షించవచ్చు అన్నారు. పర్యావరణ రక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ ఐ నారాయణ



రాజు, డీసీ ఆర్ బీ సీఐ పాండరి, పట్టణ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఆర్ ఎస్ ఐ లు, డీసీ ఆర్ బీ , ఎస్బీ ఎస్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.



## వార్డెన్ లను సస్పెండ్ చేయాలి

■ లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు గుగులోతు శివవర్మ నాయక్

■ బదిలీ అయిన వార్డెన్లు తక్షణమే వారి స్థానానికి పంపించాలి

■ అవినీతి గడ్డగా మారిన మానుకోట గిరిజన శాఖ

**మహబూబాబాద్, విశాలభారతి:** గిరిజన శాఖలో రోజురోజుకు అవినీతి పెరిగిపోతుందని, అవినీతికి అడ్డాగా మానుకోట గిరిజన శాఖ అయిపోయిందని లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు గుగులోతు శివవర్మ నాయక్ అన్నారు. వార్డెన్ లో బదిలీ ప్రక్రియలో భాగంగా కౌన్సిలింగ్లో నిర్వహించిన సంగతి తెలిసిందే, కానీ కౌన్సిలింగ్లు నిర్వహించిన వారికి కేటాయించిన హాస్టళ్లకు వెళ్లకుండా అదే హాస్టల్లో కొనసాగుతూ యధాచగా దందా చేస్తున్నారని మండిపడ్డారు. హాస్టల్ విద్యార్థులకు సరైన భోజనం, మెనూ పాటించకుండా గిరిజన విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న గిరిజన శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. వార్డెన్లకు సహకరిస్తున్న అధికారులను గుర్తించి తక్షణమే వారిపై కూడా చర్యలు తీసుకోవాలని శివవర్మ నాయక్ డిమాండ్ చేశారు. తక్షణమే కౌన్సిలింగ్ లో వార్డెన్ లకు కేటాయించిన హాస్టళ్లకు పంపించాలని, లేకపోతే జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్ నాయక్, బానోతు హరిలాల్ నాయక్, తరుణ్, బబ్బులు, వినయ్ పాల్గొన్నారు.



## ఒక్క రోజు సమ్మె నిర్వహించిన గ్రామ పంచాయతీ సిబ్బంది

**దేవరుప్పుల విశాల భారతి** దేవరుప్పుల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 'ఒక్క రోజు సమ్మె' కార్యక్రమాన్ని సీఐటీయూ దేవరుప్పుల మండల అధ్యక్షుడు బస్వ రామ్ చంద్రు ఆద్వర్యంలో గ్రామాలలో సఫాయి పనులను బంద్ చేసి గ్రామపంచాయతీ కార్మికులు,సిబ్బంది ధర్నా చేసారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది పర్మినెంట్, వేతనాలు పెంపుపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని,పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని, మల్టి పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని,పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని,వేతనాలకు ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలని,కారోబార్ లను,బిల్ కలెక్టర్ లను సహాయ కార్యదర్శిలుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎడవెల్లి వెంకట్ రెడ్డి, గౌడిశాల సోమయ్య, బాణోతు సైదులు,గణగాని ఉప్పలయ్య,రామ్ చందర్, దయాకర్, శంకర్, లక్ష్మీ,నాగమణి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



## పల్లె దవఖాన సందర్శించిన స్పెషల్ ఆఫీసర్

**నూతనకల్, విశాలభారతి:** నూతనకాల్ మండలం పెద్దనేమిలా గ్రామపంచాయతీలో ఉన్న పల్లె దవాఖానను మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.బాలు, ఎంపీడీవో పి.సునీత సందర్శించారు. స్పెషల్ ఆఫీసర్ ఆస్పత్రిలోని అన్ని రికార్డ్స్ తనిఖీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ వర్షకాలంలో వర్షాలు పడడం వలన మన ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండడం వలన దోమల స్థావరాన్ని ఏర్పాటు చేసుకొని అవి కుట్టడం వలన మలేరియా, డెంగ్యూ,చికెన్ గున్యా వ్యాధి వస్తుందని. అలా వచ్చిన వ్యాధి ఒకరి నుండి మరొకరికి దోమలు కుట్టి వ్యాప్తి చేస్తాయని, ముఖ్యంగా ఈ వర్ష కాలంలో నీరు కలుషితం కావడం వలన,కలుషితమైన ఆహారం పదార్థాలు, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడం వలన , టైఫాయిడ్,నీళ్ల విరేచనాలు,బంక విరేచనాలు, కలరా సంభవించే అష్కరం ఉన్నందున వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, నీళ్ళు కాచి వడబోసి త్రాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎల్ చరణ్. ఎంపీఓ శశికళ ఎం.ఎల్.హెచ్.పి. శిరీష ,పంచాయితీ కార్యదర్శి వినోద, లక్ష్మీ ,వెంకన్న, ప్రమీల, సరిత ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

**కోదాడ, విశాలభారతి:** తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో 202425 సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్మీడియట్ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు శ్రీ బాలాజీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ కోఆర్డినేటర్ బానొతు బాలాజీ నాయక్ అన్నారు. విద్యార్థులు 14 సంవత్సరాల వయసు ఉండి చదవడం, రాయడం వచ్చినవారు అడ్మిషన్ పొందవచ్చు అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ నోటిఫికేషన్ కు ఈ సర్టిఫికెట్ అర్హత ఉంటుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ నందు వివిధ కోర్సుల అడ్మిషన్లు కు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. అడ్మిషన్ పొందేవారు ఈ సెల్ నెంబర్లను 9912559988, 9948401228 సంప్రదించాలని అన్నారు.

# కన్నీటితో పదవీ విరమణ చేపట్టిన సయ్యద్ ఇబ్రహీం

- వృత్తిలో మంచి పేరు తీసుకురావాలి
- టి.ఎన్.జీ.ఓస్, ముజీబ్
- సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం

**విశాలభారతి, హైదరాబాద్:** టి.ఎన్.జీ.ఓస్, యూనియన్ తెలంగాణ రాష్ట్ర బోర్డ్ యూనిట్ అధ్యక్షుడు జనాబ్ సయ్యద్ ఇబ్రహీం పదవీ విరమణ సభను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వాక్ఫ బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని, సభ్యులు సయ్యద్ మునీరుద్దీన్ అహ్మద్ ముక్తార్, అబు ఫతే సయ్యద్ షా బందగీ ఖాద్రి, ఆమీర్ అహమ్మద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు చాలా సమస్యలుతో సతమవుతున్నారని కేవలం టీఎన్జీఎస్ యూనియన్ ఎల్లప్పుడు వారికే అండగా ఉంటుందని రానున్న రోజుల్లో అన్ని దీర్ఘకార సమస్యలు పరిష్కరించబడతాయని ముజీబ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జనాబ్ షబ్బీర్ అలీ నేతృత్వంలో అన్ని సమస్యలు అతి త్వరలో పరిష్కరించబడతాయని తెలిపారు. సుమారు 39 సంవత్సరాల సుదీర్ఘ సర్వీస్ అందించిన సయ్యద్ ఇబ్రహీం కంటతడి పెట్టుకుని ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ఉద్యోగులు తమకు కేటాయించిన వృత్తిలో మంచి పేరు తీసుకురావాలని సూచించారు.





# ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనది

- ఎంఏ హఫీజ్ సాబ్ మహోన్నత ఉపాధ్యాయుడు
- ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ
- ఘనంగా పదవి విరమణ కార్యక్రమం

**పటాన్ చెరు(జహీరాబాద్),విశాలభారతి:** ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ అన్నారు. ఎస్టియు సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హఫీజ్ సాబ్ ఎఫ్ఏసి హెడ్మాస్టర్ జడ్పీహెచ్ఎస్ ఫుగట్ నగర్ జహీరాబాద్ పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సయ్యద్ సాబేర్ అలీ మాట్లాడుతూ..41 సంవత్సరాల 6 నెలల 25 రోజుల పూర్తి సర్వీసులను విద్యార్థుల అభివృద్ధి కోసం అంకితం చేసిన గొప్ప ఉపాధ్యాయుడు హఫీస్ అని కొనియాడారు. పని చేసిన ప్రతి పాఠశాలలో హఫీజ్ తన సొంత ముద్ర వేసుకున్నారని చెప్పారు. తన సొంత నిధులతో పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తూ..ప్రైమరీ స్కూల్ గా ఉన్న ఫగట్ నగర్ పాఠశాలను హైస్కూల్ గా అప్గ్రేడ్ చేయించడంలో తన కృషి వెల కట్టలేనిదని అన్నారు. దశాబ్ద కాలం తర్వాత అనేక పోరాటాల ఫలితంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ఉన్న కేసులు అన్నింటిని పక్కకు పెట్టి బదిలీలు పదోన్నతులు నిర్వహించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరిని విడుదల చేస్తూ ఉపాధ్యాయుల కొరత ఉన్నందున వారి స్థానంలో విద్యా వాలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రాథోడ్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితాన్ని పిల్లల సర్వతముఖ అభివృద్ధికి త్యాగం చేసిన మహోన్నత ఉపాధ్యాయులు హఫీజ్ అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శిలు హఫీస్, జీవన్ రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీ రమణకుమార్, జహీరాబాద్ మండలాధ్యక్షులు షకీల్, ప్రధాన కార్యదర్శి అలీ నాజర్, తదితరులు పాల్గొన్నారు.



# వక్ఫ్ బోర్డ్ విషయంలో కేంద్ర వైఖరి బాధాకరం

- ఓయూలో నిరసన వ్యక్తం గడ్డం శ్రీరాం

**సికింద్రాబాద్ ,విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం మైనారిటీలకు సంబంధించి వక్ఫ్ బోర్డ్ పై తీసుకొస్తున్న నిర్ణయం తక్షణమే ఉపసంహరించాలని ఓయూ జేఏసీ డిమాండ్ చేస్తుందని గడ్డం శ్రీరాం అన్నారు. భారత సమాజంలో అందరినీ సమానంగా చూసేందుకు ప్రజలందరినీ కలుపుకునేందుకు సమ సమానత్వం అందించేందుకు నాటి జాతీయ నాయకులు మైనారిటీలకు అనేక రకాల వర్గాల వారికి అనేక రకాలైనటువంటి రిజర్వేషన్లు రాయితీలు ఏర్పాటు చేశారని శ్రీరాం గుర్తు చేశారు. ఈరోజు ఆ జాతీయ నాయకుల స్ఫూర్తిని మర్చిపోయినటువంటి బిజెపి కేంద్ర ప్రభుత్వం కేవలం వివక్షులకు అవకాశం ఇచ్చే విధంగా చట్టాలు చేయటం సమంజసం కాదని ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ హెచ్చరించారు. తక్షణమే వక్స్ బోర్డ్ పై తెచ్చే చట్టాలను నిలిపివేసి, ఒక బోర్డ్ లో ఉన్న ఆస్తులను మైనార్టీలకు ఉపయోగపడే విధంగా చట్టాలు చేయాలని, వక్ఫ బోర్డుకు మరిన్ని నిదులిచ్చి ప్రత్యేకమైన వర్గాలను ఆదుకోవాలని ఓయూ జెఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ డిమాండ్ చేశారు. గురువారం ఓయు ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీరామ్ రాష్ట్ర అధ్యక్షుడు నాయకత్వం వహించగా మహేందర్, రాజేందర్, శెట్టి సుధాకర్ సంతోష్ నాయక్, పాల్గొన్నారు.



# ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

- వెటర్నరీ అధికారి ప్రవీణ్ గౌడ్

**విశాలభారతి,కీసర :** కీసర మండల కేంద్రంలోని కీసర,బోగారం,చిర్యాల గ్రామాలల్లో పశువైద్య కేంద్రాలల్లో కుక్కలకు రెబీస్ టీకాలు వేసిన పశువైద్య అధికారులు.కుక్కలకు రేబీస్ వ్యాధి రాకుండా నిరోధించడానికి ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిపిఓ వెంకటయ్య మరియు పిడి డిఆర్డిఏ సాంబశివరావు విచ్చేశారు. ఈ సందర్భంగా చీర్యాల్ జూనియర్ వెటర్నరీ అధికారి ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ రేబీస్ ను పిచ్చికుక్క వ్యాధి,ఇది జంతువుల నుండి జంతువులకు మరియు మనుషులకు వ్యాపించే ఒక వైరల్ వ్యాధి అని అన్నారు. జంతువులు,జబ్బుతో ఉన్న జంతువు మనిషికి కరిచినచో ఈ వ్యాధి మనుషులలో వ్యాప్తిచెందుతుంది అని అన్నారు.ఈ వ్యాధితో బాధపడుచున్న జంతువులోనూ, మనుషులలోనూ ఒకే విధమైన లక్షణాలు ఉంటాయి. గాభరాగా ఉండడం,తికమక పడడం మితిమీరిన భయము,భయంకరమైన చూపు,తనదైన లోకములో విహరించడం,నోటి వెంబడి లాలాజలం కారడం,గొంతు నొప్పి,ఏమీ మింగలేకపోవడం,నీటిని,ద్రావకాలను చూస్తే భయపడడం,ఇతరులను చూసి భయపడి కరిచేయడం జరుగుతుంది అని అన్నారు.ఈ లక్షణాలు ముదిరి,గొంతు కండరాలు పెరాలసిస్ కి గురియై మనిషి ఏమీ తినలేకపోతాడని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని పంచాయతీ కార్యదర్శులు డప్పు చాటింపు వేసి మరి కుక్కలకు ఈ ఉచిత రేబిస్ వ్యాధి టికాలను వేయించుకునేటట్టు చూడాలని అని సూచించారు.కావున ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిడి డిఆర్డిఏ సాంబశివరావు కోరారు .ఈ సందర్భంగా కీసర వెటర్నిటీ హాస్పటిల్ లో కీసర మాజీ సర్పంచ్ మాధురి వెంకటేష్ తన ఇంట్లో ఉండే కుక్కకు ఈ రేబిస్ వ్యాధి టీకా వేయించారు. ఈ సందర్భంగా మే మాట్లాడుతూ మనం ఉండే కాలనీలో ఏవరైనా కుక్కలను పెంచుకునే వారు ఉంటే వారి ఈ రేబిస్ వ్యాధి గురించి చెప్పి అవగాహన కల్పించి వారి కుక్కలకు టీకా వేయించాలి చెపితే బాగుంటుంది అని అన్నారు.అలాగే వీధి కుక్కలకు కూడా ఈ టీకాలను ఇస్తే బాగుంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో కీసర పశు వైద్యాధికారి డా. శ్యామల,పంచాయతీ కార్యదర్శి నారాయణ గౌడ్ ,రవి ప్రకాష్ గౌడ్,సంతోష్,చీర్యాల కీసర మాజీ సర్పంచులు ధర్మేంధర్ మాధురి,యాదగిరి, మల్లేష్,కుమార్,బిల్ కలెక్టర్లు నర్సింగ్ రావు,హరి,కోల నవీన్,కుమార్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రహదారుల విస్తరణకు చర్యలు

- ప్రతి కూడలిని అద్భుతంగా తీర్చిదిద్దుతాం
- జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** ఐటీకి కీలకమైన ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు సాధ్యమున్న ప్రాంతాలలో రహదారుల విస్తరణకు చర్యలు చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు.రహదారులు ఇరుకుగా ఉండి ట్రాఫిక్ నెమ్మదిస్తున్న ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన విస్తరించాలన్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, బయోడైవర్సిటీ,పారిశుద్ధ్య విభాగం అధికారులతో కలిసి జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా గచ్చిబౌలి రస్తా,రోలింగ్ హిల్స్, నానక్‌రామ్‌గూడ ఓఆర్ఆర్, మూడో లెవెల్ నూతన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు,బోటానికల్ గార్డెన్ కూడలి,రాడిసన్ హోటల్, క్యూ మార్ట్ కూడలి, బయోడైవర్సిటీ కూడళ్లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రహదారులపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయాలని,వర్షపు నీరు నిలవకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.ఓఆర్ఆర్‌కు అనుసంధానంగా ఉన్న గచ్చిబౌలి కూడలిని మరింతగా సుందరీకరించే లక్ష్యంతో పని చేయాలని,పరిశుభ్రత,సెంట్రల్ మీడియంలో పచ్చదనం, ఫుట్‌పాత్‌లు,డివైడర్‌ల నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలన్నారు.ఈ కూడలిని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. కొత్తగూడ ఫ్లై ఓవర్ దిగే వైపు అంజయ్యనగర్ వద్ద రహదారి వైపు ఉన్న భారీ బండరాయిని తొలగించి రహదారిని విస్తరించాలన్నారు.ఇక్కడ ట్రాఫిక్ నెమ్మదిస్తున్నదని , విస్తరణతో సమస్యకు ఉపషమనం లభిస్తుందని జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి అన్నారు . బొటానికల్ గార్డెన్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను ఏర్పాటు చేయాలని, వాహనాలు సులువుగా బోటానికల్ నుంచి కొండాపూర్ వైపుకు మళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఇప్పటికే వాల్ పేయింటింగ్, స్ట్రీట్ ఫర్నీచర్ , కూడళ్ల అభివృద్ధిని మరింత విస్తరించే ప్రణాళికలను సిద్ధం చేసినట్లు త్వరలో పనులను ప్రారంభిస్తామని ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్,డీసీ రజనీకాంత్‌రెడ్డి,పలు విభాగాల అధికారులు గణపతి ,రవీందర్, డాక్టర్ నగేష్,డీఈలు పాల్గొన్నారు.



# ఓయూ ఎంబీఏ కాలేజ్ డీన్ గా ప్రొ శ్రీరాములు భాధ్యతలు స్వీకరణ

- ఘనంగా సన్మానించిన ప్రొఫెసర్లు, ఉద్యోగులు యజమానులు.

**సికింద్రాబాద్ , విశాలభారతి:** లోటు బడ్జెట్ తో నడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు సలహాలతో కూడిన పలు సెమినార్లను నిర్వహిస్తామని ఓయూ ఎంబీఏ కాలేజ్ ప్రిన్సిపల్ డీన్ సీనియర్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ డీన్ గా ప్రిన్సిపల్, హెచ్ ఓడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ప్రొ.శ్రీరాములు డిన్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ప్రొ. శ్రీరాములు ఓయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ గా భాధ్యతలను నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన కళాశాల వైస్ ప్రిన్సిపల్ గా, పీజీఆర్ఆర్ సీడీఈ జాయింట్ డైరెక్టర్ గా ఓయూ చీఫ్ వార్డెన్ గా, ఓయూ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ (సిడీసీ) డైరెక్టర్, మేనేజ్మెంట్ విభాగంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ వంటి భాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించారు. పదవీబాధ్యతలను స్వీకరించిన అనంతరం కాలేజ్ ఆడిటోరియంలో డీన్ ప్రొ. శ్రీరాములును వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధక విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీన్ ప్రొ. వెంకటయ్య, హెడ్ ప్రొ. సుధ, బీవోఎస్ చైర్మన్ ప్రొ. స్మితా సాంబ్రాని, ప్రొ.వై. జాహంగీర్, డా. విద్యాసాగర్ రావు, డా. సమున్నత, పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్లు వి.శేఖర్, ఆర్. నాగేశ్వర్ రావు, సిద్దార్ధ విద్యాసంస్థల కరస్పాండెంట్ డా. నాగయ్య, డాక్టర్ ఖయ్యూం ఖాన్, 50 కాలేజీల ప్రిన్సిపాల్స్, 25 కాలేజీల కరస్పాండెంట్స్ తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ను కాటేసిన క్యాన్సర్ మహమ్మారి

- రేక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం.
- తెలియని వయసులోనే నాన్న చనిపోయాడు.
- ఆటో నడుపుకుంటూ కుటుంబపోషణ.



**మరిపెడ, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలం గిరిపురం గ్రామపంచాయతీ ఇటుకల గడ్డ తండకు చెందిన ఆంగోతు శివాజీ(26) S/: భీమ చిన్నతనంలోనే నాన్న చనిపోవడం, తల్లి కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించడం ఆ ఇద్దరు పిల్లలు చేతికొచ్చిన ఆనందంలో తల్లి ఉన్న క్రమంలో పెద్ద కొడుకు శివాజీ పెళ్లి చేసి చిన్న కొడుకును కూడా పెళ్లి చేయడం జరిగింది. ఎవరికి వారు ఏర్పడడం గుంట భూమిలేని కుటుంబం శివాజీ ఆటో నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నాడు. వీధి శివాజీ పై విది కన్నెర్ర చేసి క్యాన్సర్ రూపంలో శివాజీని కాటేయడం జరిగింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, భార్య ఆంగోతు అరుణ అంగన్వాడీ ఆయా ఆ జీతంతో కుటుంబాన్ని నడుపుకుంటూ వస్తున్నది. కానీ విధి ఓరవలేదేమో ఆ కుటుంబ పెద్ద క్యాన్సర్ రూపంలో జబ్బు ఏర్పడడం జరిగింది. తన భర్త బ్రతకడం కోసం ఆ భార్య ఎన్ని కష్టాలు పడ్డాదొ ఆ తండవాసులు వివరిస్తుంటే అందరికీ కంటతడిని పెట్టించింది. తన భర్త బతకాలని చెప్పి వివిధ ప్రైవేట్ హాస్పిటల్లో తిప్పుకుంటూ, సుమారు గుంట భూమి లేని ఆ కుటుంబం అప్పులు పాలై తన వైద్య ఖర్చులు కోసం ఐదు లక్షలు అప్పులు చేసి, తన భర్త బ్రతుకుతడేమో అని పిల్లలు భార్య ఎదురుచూస్తున్న, క్రమంలో భర్త చేయి జారిపోవడం తండవాసులందరికీ కంటతడి పెట్టించింది. చిన్నతనం నుండి ఆటోను నమ్ముకుని ఆటో డ్రైవర్ గా పని చేస్తూ చనిపోయిన శివాజీని, కుటుం



# నాలా పనులను పరిశీలించిన కార్పొరేటర్

**ఎల్బీనగర్ ,విశాలభారతి:** హస్తినాపురం డివిజన్లో డ్రైనేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ అన్నారు స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు సాగర్ ఎంక్లేవ్ కాలనీలో డ్రైనేజీల్లో పూడికతీత పనులను పోచమ్మ గడ్డలు సిఆర్ఎంపీ నిధుల ద్వారా చేపడుతున్న నాలా పనులను ఏఈ హేము నాయక్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీల్లో పూడికతీతను సక్రమంగా చేపట్టాలని వర్షాలకు ఎక్కడ డ్రైనేజీ పొంగి పొర్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సిఆర్ ఎంపీ నిధుల ద్వారా చేపడుతున్న పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అసిస్టెంట్ ఇంజనీర్ హేము నాయక్ వర్క్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ ఆసుపత్రిలో హరితహారం

**హుజురాబాద్ ,విశాలభారతి:** హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో హరిత హర కార్యక్రమంలో చెట్లు నాటడం జరిగింది ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మనం చెట్ల ద్వారా ఆక్సిజన్ అందడం మరియు చెట్ల కింద కూర్చుని సేద తీర్చుకోవడం చెట్ల ద్వారా ప్రజలకు చాలా ఉపయోగాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ చెట్లను పెట్టడం యావత్ ప్రజలు అందరూ వినియోగించాలని ఈ కార్యక్రమంలో డాక్టర్, కృష్ణ ప్రసాద్, డి సి హెచ్ ఎస్, కరీంనగర్ జిల్లా డాక్టర్, రాజేందర్ రెడ్డి, మెడికల్ సూపర్డెంట్ హుజురాబాద్, సుధాకర్ రావు, ఆర్ ఎం ఓ మరియు నజముల్లా ఖాన్, (అడ్మిట్ స్టేట్ యు ఆఫీసర్ ), ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఇండియన్ యూత్ కాంగ్రెస్ జమ్మికుంట
# మండల అధ్యక్ష బరిలో బుడిగె శ్రీకాంత్



**జమ్మికుంట, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బుడిగె శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఎన్నికలు జరుగబోతున్న సందర్భంగా, జమ్మికుంట మండల మరియు పట్టణానికి చెందిన విద్యార్థిని విద్యార్థుల, యువతి యువకుల మద్దతుతో జమ్మికుంట అధ్యక్ష బరిలో నిలిచినట్టు తెలిపారు. తాను గతంలో విద్యార్థి నాయకునిగా, విద్యార్థుల సమస్యల పట్ల తలపెట్టిన ప్రతీ కార్యక్రమంలో పాల్గొని, నాటి నుంచి నేటి వరకు ఎంతైతే బాధ్యతతో పనిచేస్తున్నానో అంతే అకుంటిత దీక్షతో యువతి యువకుల సమస్యలు తీర్చడంలో, వారికి అండగా నిలబడడంలో ముందు వరుసలో ఉంటానని పేర్కొన్నారు. జమ్మికుంట మండల మరియు పట్టణ యువతీ యువకుల చిరకాల కోరిక అయినటువంటి మినీ స్టేడియం నూ జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేయడానికి అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి, ఇక్కడ ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని, తద్వారా యువతి యువకులు క్రీడారంగంలో ఈ ప్రాంతం నుండి రాష్ట్రస్థాయికి, జాతీయస్థాయికి వెళ్లే ఆస్కారం ఉందని తెలిపారు. అదే విధంగా, జమ్మికుంట మండల మరియు పట్టణ ప్రాంత యువతి యువకులకు ఏ సమస్య ఉన్న తక్షణమే స్పందించి, ఆ సమస్యను పరిష్కరించే విధంగా ఒక హెల్ప్ సెంటర్ ను ఏర్పాటు చేసి అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com



vishalabharathi Telugu Daily
శుక్రవారం,
09.08.2024
హైదరాబాద్






# డబుల్ ఇస్మార్ట్' ఆడియన్స్‌ని చాలా ఎంటర్ టైన్ చేస్తుంది

**: బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్**

డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, ఉస్తాద్ రామ్ పోతినేని హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్' థియేట్రికల్ రిలీజ్ కౌంట్ డౌన్ ప్రారంభమైంది. సెన్సేషనల్ ప్రమోషనల్ కంటెంట్ తో నేషనల్ వైడ్ గా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తున్న ఈ మూవీ ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఈ మూవీ పవర్ ఫుల్ రోల్ పోషిస్తున్నారు. కావ్య థాపర్ హీరోయిన్. ఈరోజు బిగ్ బుల్ అనే స్పెషల్ సాంగ్ లాంచ్ చేశారు మేకర్స్. పూరి జగన్నాథ్ తన విలన్‌లను పవర్‌ఫుల్ క్యారెక్టర్స్ ని ప్రెజెంట్ చేయడంలోస్పెషలిస్ట్. ఇప్పుడు ఆయన డబుల్ ఇస్మార్ట్‌లో మెయిన్ విలన్‌పై ఒక పాటను ఇంక్లూడ్ చేశారు. బిగ్ బుల్ క్యారెక్టర్ ని సంజయ్ దత్ పోషించారు. మణి శర్మ కంపోజ్ చేసిన "బిగ్ బుల్" విజువల్, మ్యూజికల్ గా పవర్ ఫుల్ నెంబర్. హై ఎనర్జీ, పండుగ వాతావరణంలో సెట్ చేయబడిన ఈ పాట, కావ్య థాపర్ గ్లామర్ టచ్ యాడ్ చేసింది, సినిమాలోని కీలక పాత్రలను ఒకచోట చేర్చింది. వారి పెర్ఫార్మెన్స్ డ్యాన్స్ ఫ్లోర్‌ను ఆదరగొడుతోంది. భాస్కరభట్ల రవి కుమార్ సాహిత్యం బిగ్ బుల్ పాత్ర ఎసెన్స్ ని ప్రజెంట్ చేస్తోంది. పృధ్వీ చం,సంజన కల్మంజే వోకల్స్ ట్రాక్‌కి మరింత ఎనర్జీని ఇచ్చాయి. ముంబైలో గ్రాండ్ గా జరిగిన బిగ్ బుల్ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ మాట్లాడుతూ.. అందరికీ నమస్తే. తెలుగు సినిమా డైనమిక్స్ ని మార్చిన డైరెక్టర్ పూరి జగన్నాథ్. ఈ సినిమాలో నన్ను పార్ట్ చేసి, బిగ్ బుల్ గా ప్రజెంట్ చేస్తున్న పూరి సర్ కి థాంక్ యూ. ఛార్మి పరేషాన్ చేసింది (నవ్వుతూ) తన హార్డ్ వర్క్, డెడికేషన్, ఫోకస్ వలనే ప్రోడక్ట్ అంత అద్భుతంగా వచ్చింది. కావ్య ఇందులో చాలా బ్యూటీఫుల్ గా కనిపించింది. విషు కి థాంక్ యూ. రామ్ నా యంగర్ బ్రదర్ లాంటి వాడు. తనకు పని చేయడం చాలా మజా వచ్చింది. డబుల్ ఇస్మార్ట్ గా మస్త్ ఉంటాడు. తనతో వర్క్ చేయడం ప్లెజర్ అండ్ హానర్. తను గుడ్ పెర్ఫార్మర్. వెరీ హార్డ్ వర్కర్. తన ఫన్ తో ఈ సినిమా చేశాం. చాలా చోట్ల తిరిగాం. చాలా మస్తీ చేశాం. తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. సినిమాని చాలా ఎంజాయ్ చేస్తారు. అందరికీ థాంక్ యూ' అన్నారు.



# 'మెకానిక్ రాకీ' నుంచి గుల్లేడు గుల్లేడు రిలీజ్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తన అప్ కమింగ్ మూవీ 'మెకానిక్ రాకీ'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమౌతున్నారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్ టైనర్ గా రూపొందించారు. ఈ చిత్రానికి రవితేజ ముళ్లపూడి రచన, దర్శకత్వం వహించారు. ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి తన SRT ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఫస్ట్ లుక్, ఫస్ట్ గేర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ ఫస్ట్ సింగిల్ గుల్లేడు గుల్లేడు రిలీజ్ చేయడంతో మ్యూజిక్ జర్నీ ప్రారంభించారు. ఈ పాట లైవ్లీ ఫోక్ టచ్ తో ఆకట్టుకుంది. లిరిక్ రైటర్ సుద్దాల అశోక్ తేజ ట్రెడిషన్ ఉట్టిపడేలా అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. జేక్స్ బెజోయ్ సాంగ్ ని ఫోక్ రూట్స్ తో పెప్పీ బీట్‌లతో, డైనమిక్, ఎనర్జిటిక్ మ్యూజిక్ ఎక్స్ పీరియన్స్ ని క్రియేట్ చేశారు. వెడ్డింగ్ షెనానిగన్స్, ఫోక్ ఎనర్జీ తో కలిసినప్పుడు రిజల్ట్ వైబ్రెంట్ సెలబ్రేషన్ లా వుంటుంది. ఇది ట్రెడిషన్స్ తో ఎంటర్టైన్మెంట్ ని బ్లెండ్ చేసి మెమరబుల్ వైబ్ ని క్రియేట్ చేస్తోంది. సింగర్ మంగ్లీ ప్లజెంట్, ఎంగేజింగ్ పెర్ఫార్మెన్స్ తో సాంగ్ ని పాడటం ఆకట్టుకుంది. ఈ పాటలో విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరిల ఎట్రాక్టివ్ డ్యాన్స్ మూవ్స్ మరింత ఆకర్షణను పెంచాయి. వారి ఎలిగెంట్ కెమిస్ట్రీ, కొరియోగ్రఫీ వీడియోను విజువల్ డిలైట్‌గా మార్చాయి, యష్ మాస్టర్ కొరియోగ్రఫీ ఆకట్టుకుంది.అద్భుతమైన సెట్‌లో చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. ట్రెడిషనల్, మోడరన్ ఎలిమెంట్స్ కూడిన గుల్లేడు గుల్లేడు మోమరబుల్ హిట్ అవుతుందని ప్రామిస్ చేసింది. మెకానిక్ రాకీ సౌండ్‌ట్రాక్స్ పై హై బార్‌ను సెట్ చేసింది.

# రిలీజ్ కు రెడీ అవుతున్న "క" ఫస్ట్ సింగిల్



యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ "క" సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ కు రెడీ అవుతోంది. త్వరలోనే ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేయబోతున్నారు. సామ్ సీఎస్ బ్యూటిఫుల్ కంపోజిషన్ లో వస్తున్న "క" సాంగ్స్ మ్యూజిక్ లవర్స్ ను మెస్మరైజ్ చేయబోతున్నాయి. "క" సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో "క" సినిమాను రూపొందిస్తున్నారు. తెలుగు స్టేట్స్ లో "క" సినిమాను సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఈ సినిమా త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకురాబోతున్నారు.

# 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది.. నిర్మాత నిహారిక కొణిదెల

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ఆగస్ట్ 9న వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో గురువారం నాడు నిర్మాత నిహారిక కొణిదెల మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన సంగతులివే.. కథ విన్నాక ఈ చిత్రంలో నా పేరు మాత్రం కనిపించాలని అనుకున్నాను. ఫీచర్ ఫిల్మ్ చేయాలని అనుకున్న టైంలో అంకిత్ ద్వారా ఈ కథ నా దగ్గరకు వచ్చింది. మ్యూజిక్‌తో పాటుగా ఈ కథను నాకు వినిపించారు. అనుదీప్ గారు అప్పటికే మ్యూజిక్ చేసేశారు. సిటీలో పుట్టి పెరిగిన నేను జాతర ఎక్స్‌పీరియెన్స్ చేయలేదు. కానీ నాకు కళ్లకు కట్టినట్టుగా వంశీ చూపించాడు. నెరేషన్ అద్భుతంగా ఇచ్చాడు. ఓటీటీలో అయినా థియేటర్లో అయినా సినిమా మేకింగ్ ప్రాసెస్ ఒకటే. అందుకే ఈ కథను ఎలాగైనా నిర్మించాలని ఫిక్స్ అయ్యా. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే జాతర చుట్టూ ఈ కథను రాసుకున్నాడు. మూడు తరాలను చూపించేలా ఈ కథ ఉంటుంది. వంశీ గారి పర్సనల్ ఎక్స్‌పీరియెన్స్‌లు కూడా ఇందులో ఉన్నాయి. వంశీ గారు పవన్ కళ్యాణ్ గారికి అభిమాని. 2019 ఎన్నికల ప్రచార టైంలో జరిగిన విషయాలను కూడా ఇందులో తన స్టైల్లో, కాస్త సెటైరికల్‌గా చూపించారు. పదకొండు మంది అబ్బాయిల కారెక్టర్లో నన్ను నేను ఊహించుకొన్నాను. సినిమాను చూసే ప్రతీ ఆడియెన్ ఏదో ఒక కారెక్టర్‌తో ట్రావెల్ చేస్తారు. ప్రతీ ఒక్కరూ సినిమాకు కనెక్ట్ అవుతారు. టాలెంట్ మాత్రమే కాదు.. క్రమశిక్షణ ఉంటేనే ఇండస్ట్రీలో ఎదుగుతారని చిరంజీవి గారు చెబుతుంటారు. ఆ క్రమశిక్షణ నేను వంశీలో చూశాను. ఆయన సినిమా కోసం చాలా కష్టపడ్డారు.



# కేరళ రాయల్ క్లాన్‌తో ఆకట్టుకున్న నటి పూనమ్ కౌర్

ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవం, భారతదేశ సాంస్కృతిక, ఆర్థిక వ్యవస్థలో భాగమైన చేనేత కార్మికుల యొక్క కీలక పాత్రను, ప్రాముఖ్యతను తెలియజేసే రోజుది. అందులో భాగంగా ఈ ఏడాది నటి పూనమ్ కౌర్ చేనేత కళ పట్ల తన మద్దతుని తెలియజేసింది.. ఆమె హృదయపూర్వకమైన కథను తెలియజేసింది. 5 చేనేత, చేనేత వస్త్రాలపై పూనమ్ కౌర్ పరిశోధన చేస్తున్నారు. అలాగే న్యాయవాది కూడా అయిన ఆమెకు కేరళలోని ఇద్దరు యువరాణులు కలిసే సువర్ణావకాశం దక్కింది. వారే పూయం తిరునాళ్ పద్మనాభ సేవిని గౌరీ పార్వతి బాయి, పద్మనాభ సేవిని పద్మశ్రీ అవార్డు గ్రహీత గౌరీ లక్ష్మీ బాయిలను కలిశారు పూనమ్. ఈ సందర్భంలోకేరళ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో తమ అనుభవాలను, అభిరుచిని ఇద్దరు యువరాణిలు తెలియజేశారు. పూయం తిరునాళ్ పద్మనాభ సేవిని గౌరీ పార్వతి బాయి పద్మనాభ స్వామి ఆలయం పట్ల తనకున్న భక్తిని తెలియజేయగా, పద్మనాభ సేవిని పద్మశ్రీ అవార్డు గ్రహీత గౌరీ లక్ష్మీ బాయి పూనమ్‌కు అందమైన కేరళ చేనేత చీరను బహుమతిగా ఇచ్చారు. ఆటోఇమ్యున్ డిజార్డర్‌తో బాధపడుతున్నప్పటికీ పూనమ్ కౌర్ చేనేత అభివృద్ధిలో భాగంగా చేసున్న పనికి నిబద్ధతతో కట్టుబడి ఉన్నారు. అలాగే ఓ కొత్త ప్రాజెక్ట్‌ను చేపట్టాలని చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న యువరాణులు దేశంలోని చేనేత కార్మికులకు మంచి భవిష్యత్త ఉండేలా చూడాలని కోరటమే కాకుండా పూనమ్ చేయనున్న భవిష్యత్ కార్యాచరణలన్నీ విజయవంతం కావాలని అభిలషించారు. నేటి జాతీయ చేనేత దినోత్సవం అనేది 1905 నాటి స్వదేశీ ఉద్యమాన్ని గుర్తుకు తెస్తుంది. భారతీయ తయారీ ఉత్పత్తులకు మద్దతు ఇవ్వటమే దీని ప్రధానోద్దేశం. ఈ సంవత్సరం జాతీయ చేనేతో దినోత్సవ 10 వ వార్షికోత్సవం. భారతదేశం అంతటా వేడుకలు మరియు కార్యక్రమాలు జరుగుతున్నాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత పరిశ్రమ గణనీయంగా తోడ్పాటుని అందిస్తోంది. దీని వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 లక్షల మందికి ఉపాధి కలుగుతుంది. భిన్నత్వంలో ఏకత్వంలా ప్రతి ప్రాంతంలోనూ అద్భుతమైన వైవిధ్యాలలను చేనేత మనకు ఆవిష్కరిస్తుంది. ఈ వైవిధ్యం భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

# మిస్టర్ బచ్చన్ అందరి అంచనాలని అందుకుటుంది



మాస్ మహారాజా రవితేజ, హరీష్ శంకర్ కాంబో 'మిస్టర్ బచ్చన్'తో మరో మాస్ సునామీని సృష్టించడానికి సిద్ధంగా ఉంది. మూవీ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదల కానుంది. ఈ సినిమాకి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి, టీజర్‌తో పాటు పాటలు హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్ ను లాంచ్ చేశారు. రవితేజ చెప్పిన పవర్ ఫుల్, ఇంపాక్ట్ ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. "సరిహద్దు కాపాడేవాడే సైనికుడు కాదు... సంపద కాపాడేవాడు కూడా సైనికుడే.."అనే డైలాగ్ సినిమాకి టోన్ సెట్ చేస్తుంది. రవితేజ కమాండింగ్ ప్రెజెన్స్ కట్టిపడేసింది. బచ్చన్ తన ఊర్లో జిక్కీ అనే అమ్మాయితో ప్రేమలో ఉంటాడు. ట్రైలర్‌లోని రెప్పల్ డప్పల్ అనే హై-ఎనర్జీ నంబర్ ఒక హైలెట్ గా నిలిచింది. పవర్ ఫుల్ వ్యక్తికి వ్యతిరేకంగా ఐటీ దాడులకు నాయకత్వం వహించడానికి హీరో యాక్షన్ లోకి దిగడంతో ట్రైలర్ లో ఇంటెన్స్, కాన్ఫ్లిక్ట్ నెక్స్ట్ లెవల్ కి చేరుకుంది. ట్రైలర్ ప్రామిస్ చేసినట్లుగా, ఈ మూవీ రొమాన్స్, డ్రామా, యాక్షన్ గ్రేట్ బ్లెండింగ్ ని అందిస్తోంది. టైటిల్ రోల్‌లో రవితేజ పెర్ఫార్మెన్స్, ఎనర్జీ, చరిష్మా అద్భుతంగా వుంది. మాగ్నెటిక్ ప్రెజెన్స్‌తో స్క్రీన్‌పై అదరగొట్టారు. జగపతి బాబు పవర్ ఫుల్ రోల్ ని పోషించారు. తన క్యారెక్టర్ నెరేటివ్ లో ఇంటెన్స్, కాన్ఫ్లిక్ట్ ని యాడ్ చేసింది. భాగ్యశ్రీ బోర్స్ తన అద్భుతమైన గ్లామర్, పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. రవితేజ, భాగ్యశ్రీ లవ్లీ కెమిస్ట్రీని పంచుకున్నారు. సత్య అండ్ గ్యాంగ్ హ్యూమర్ రిలీఫ్ ని అందిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ.. రవితేజ గారు నా ఫస్ట్ సినిమా చేసినప్పుడు ఎలా వున్నారో ఇప్పటికీ అలానే వున్నారు. ఏం చేంజ్ అవ్వలేదు. 'మిరపకాయ్' సక్సెస్ మా కాంబినేషన్ పై అంచనాలు పెంచింది. ఆ అంచనాలు దాటే సినిమా మిస్టర్ బచ్చన్ అవుతుందనే నమ్మకం వుంది. మిరపకాయ్ కి సినిమా రవితేజ గారే టైటిల్ పెట్టారు. ఈ సినిమాకి కూడా ఆయనే టైటిల్ పెట్టారు. భాగ్యశ్రీ బోర్సే తెలుగు నేర్చుకొని మరీ డబ్బింగ్ చెప్పింది. తను చాలా హార్డ్ వర్క్ చేసింది. తన క్యారెక్టర్ ని మ్యాచ్ చేసింది. ఆగస్ట్ 15న అమితాబ్ బచ్చన్ గారి షోలే సినిమా రిలీజైయింది. రవితేజ గారి బచ్చన్ అదే డేట్ కి రావడం ప్యూర్ కో-ఇన్సిడెంట్. ఇది అనుకోకుండా వచ్చింది కాబట్టి ట్రైలర్ లో యాడ్ చేశాం. ఆగస్ట్ 15న మా సినిమాతో పాటు డబుల్ ఇస్మార్ట్ వస్తోంది. రెండు సినిమాలని బ్లాక్ బస్టర్ చేయాలి' అని కోరారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.